
ఆధ్యాత్మిక అంతర్జాల పత్రిక

# శ్రీసన్నిధానం

సంపుటి 02 సంచిక 09 సెప్టెంబర్ 2023



# శ్రీసన్నిధానం

srisannidhanam.org

## విషయసూచిక


3. సంపాదకీయం
4. నెలవారి పంచాంగం
5. మన దేవాలయాలు
6. రామానుజ సుధామాధురి
8. శ్రీకృష్ణావతార ప్రాశస్త్యమ్
9. శ్రీపతిస్తుతి
10. శుభాశుభ నిర్ణయాలు-మీమాంస
12. భూలోకం, వైకుంఠం కొలిచేకొండ
13. జ్యోతిర్విజ్ఞానమ్
14. సందేహాలు-సమాధానాలు
15. దివ్య తిరువడి గళే శరణం
16. భాగవతంలో భగవంతుని కథలు
18. అవయవ విభూతి
20. సమాశ్రయణములు
24. ఆధ్యాత్మిక వార్తలు




## ముఖచిత్ర పరిచయం

మానవాళికి దిశా నిర్దేశం చేసే అవతారం. కృష్ణావతారం పరమార్థం మనకు బోధపడేలా ఈ పండుగను దేశంలోని అన్ని ప్రాంతాల వారు జరుపుకుంటారు. ఉత్తర భారతం నుంచి దక్షిణ భారతం వరకు వివిధ రాష్ట్రాల్లో ఆయా ప్రాంతాల ఆచార వ్యవహారాల ప్రకారం శ్రావణ బహుళ, అష్టమి తిథి రోజు, రోహిణి నక్షత్రం రోజు కృష్ణాష్టమి జరుపుకుంటారు. ద్వాపర యుగంలో జన్మించిన శ్రీకృష్ణ అవతార రహస్యాలు ఇప్పటికీ మనకు మధురలో గోచరమవుతాయి. తెలుగు రాష్ట్రాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు జరిగే తీరు అత్యంత ఆసక్తి కరం. జన్మాష్టమి మరునాడు ఉట్ల పండుగ వేడుకగా జరుపుకోవడం సంప్రదాయంగా వస్తోంది. గుజరాత్‌లో నాలుగు రోజుల నుంచి వేడుకలు జరిగితే ఉడిపిలో అర్ధరాత్రి నుంచి వేడుకలు ప్రారంభం అవుతాయి. శ్రీకృష్ణ లీలా విభూతి మనకు అర్థమయ్యేలా ఆయా ప్రాంతాల్లో గీతాలు, పాశురాలు గానం చేస్తారు. సంప్రదాయన్ని పరిరక్షించుకుంటూ, జాతిని సంఘటిత పరిచే దిశగా, మన పెద్దలు మనకు ప్రసాదించిన వరంగా భావించి ఈ పండుగను భక్తిశ్రద్ధలతో వేడుకగా జరుపుకుందాం.


### సంపాదక మండలి

వొద్దిపర్తి రామచంద్రమూర్తి — చీఫ్ ఎడిటర్

సముద్రాల శారద — వొపీనియన్ ఎడిటర్

డింగరి శ్రీనివాసమూర్తి — మేనేజింగ్ ఎడిటర్

### గౌరవ సంపాదకులు

శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక

శ్రీమాన్ శ్రీ కె. ఇ. స్థలశాయి ఆచార్య

శ్రీమాన్ శ్రీ అమరవాది వెంకటనర్సింహా చార్యులు

PUBLISHED BY : డింగరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్



చిరునామా: ఇ.నెం 10-2-225, విద్యానగర్ కరీంనగర్ ,తెలంగాణా - 505001 ఫోన్ : 878 2253323 ; 9502583323;



నోట్:- సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు మీరూ మాతో కలిసినడువండి! అంతర్జాలంలో పబ్లిష్ చేసేవారు 'శ్రీసన్నిధానం సంచిక నుంచి సేకరణ' అని రాయడం మరువకండి!! కాపీ రైట్ చట్టానికి కట్టుబడి ఉందాం.

# సంపాదకీయం

## అంతరిక్ష రహస్యాల గుట్టు విప్పుతున్న చంద్రయాన్



అంతరిక్ష పరిశోధనలో అగ్రరాజ్యాల సరసన చేరిన భారతదేశం, చంద్రునిపై పరిశోధనకు వ్యోమవాహక నౌకలను పంపడంలో ముందుస్థానంలో నిలిచింది. చంద్ర కాంతి ఆహ్లాదకరం అంటూ కవితలల్లడం మాట ఎలా ఉన్నా చంద్రుని గురించి మనం తెలుసుకోవాల్సింది చాలా ఉంది. నవగ్రహ కూటమిలో ఒకటిగా చేరిన చంద్ర బలము ఉంటే కాని మానవుని జీవితము సజావుగా సాగదని ప్రాచీనం నుండి జ్యోతిష్య సిద్ధాంతులు చెబుతున్నారు. ప్రతి విషయానికి ఒకలెక్క ఉంది. దానికి ఆధారాలు ఉన్నాయి. తాళ్ళపాక అన్నమాచార్యుల వారు అందించిన మధుర గీతం చందమామ రావే జాబిల్లి రావే! అని భక్తి పారవశ్యంతో ఆలపిస్తూ గోరుముద్దలు తినిపిస్తూ మాతృ మూర్తులు ఆనంద పరవశులు అవుతారు. శ్రీరామాయణంలో రాములవారు చందమామ కావాలంటూ మారాం చేశాడని కవులు తమ కావ్యాలలో చెపుతూ వచ్చారు. దివినుంచి భువికి చందమామను తీసుకు రావడం మాట ఎలా ఉన్నా చంద్రునిపై విడిదిచేసి విహరించే రోజు భావితరాలవారు చూసే అవకాశం లేకపోలేదు. చంద్రయాన్ ప్రయోగఫలితాలు అందుకు చేరువలో ఉన్నాయి. చంద్రునిపై జలనిక్షేపాలు ఉన్నాయని, ఖనిజ సంపద ఉండే అవకాశం ఉందని, ఇందనం లభించవచ్చన్న ఆలోచనకు ప్రయోగ ఫలితాలు బలం చేకూరుస్తున్నాయి. ఈ విషయాన్ని చాక్షుషోపనిషత్‌లో ఇదివరకే ఋషులు చెప్పారు. చంద్రున్ని అమృతమయం అని కూడా అన్నారు. చంద్రమా మనసో జాతః అని పురుషసూక్తంలో కూడా ఉంది. జాబిల్లి ఉపరితలంపై ఎలా ఉంది అన్నవిషయమై ప్రస్తుతము ఆధారాలు మనవద్ద లేకపోవచ్చు కానీ ప్రయోగఫలితాలు అందుకు చేరువలో ఉన్నాయి. చంద్రుడి దక్షిణ ధ్రువం ఉపరితలంపై విక్రమ్ ల్యాండర్ దిగిన తర్వాత దాని ర్యాంప్ విచ్చుకుంది. అందులో నుంచి ఆరు చక్రాల ప్రజ్ఞాన్ రోవర్ నెమ్మదిగా ర్యాంప్ మీదుగా దిగింది. ల్యాండర్, రోవర్ 14 రోజుల పాటు జాబిల్లి ఉపరితలంపై పరిశోధనలు చేస్తూ వెంటవెంటనే మనకు సమాచారం పంపుతుంది. చందమామపై దాగి ఉన్న రహస్యాలు తెలుసుకునేందుకు ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్ 3 మిషన్ జీవితకాలం కేవలం 14 రోజులే. చంద్రునిపై దిగిన విక్రమ్ ల్యాండర్, దాన్నుంటి బయటికి వచ్చి పరిభ్రమిస్తున్న ప్రజ్ఞాన్ రోవర్ కేవలం ఈ సమయంలో ఫలితాలు అందించాలి. ఆతరువాత వాతావరణం ప్రతికూలంగా మారిపోతుంది. అంటే సూర్యుడు అస్తమిస్తాడు. దీంతో అక్కడ చిమ్మ చీకటి అయిపోతుంది. వెలుతురు అంతా పోయి చిమ్మ చీకటిగా మారి, ఉష్ణోగ్రత మైనస్ 180 డిగ్రీలకు చేరుకుంటే చంద్రయాన్ రోవర్, ల్యాండర్ రెండూ గడ్డకట్టిపోవడం ఖాయం. తర్వాత అంటే చంద్రునిపై మరో 14 రోజుల తర్వాత సూర్యుని వెలుగు ప్రసరిస్తుంది. అప్పుడు మళ్లీ ల్యాండర్, రోవర్‌పై సూర్యకిరణాలు పడతాయి. తిరిగి పనిచేడం ప్రారంభిస్తే అద్భుతం జరిగిట్టే అని ఇస్రో భావిస్తోంది. చంద్రయాన్–3 కార్యక్రమంపై ప్రపంచమంతా దృష్టి పెట్టింది. భారత దేశ కీర్తి, ప్రతిష్ఠలను శక్తి, సామర్థ్యాలను చాటి చెప్తూ ఆర్థికాభివృద్ధికి కూడా దోహదపడే ఈ కార్యక్రమాన్ని అందరూ ఆసక్తిగా గమనిస్తున్నారు. ముఖ్యంగా దీని కోసం భారత్ చేస్తున్న ఖర్చు ఓ హాలీవుడ్ చిత్ర నిర్మాణానికి అయిన ఖర్చు కన్నా చాలా తక్కువ అని పలువురు ప్రశంసించారు. భారత సంతతికి చెందిన వ్యోమగామి సునీతా విలియమ్స్ మాట్లాడుతూ జాబిల్లిపై చేసే పరిశోధనల వలన ఇతర గ్రహాలపై మనుషులకు స్థిరమైన నివాసాలను ఏర్పాటు చేసుకునేందుకు ఉన్న అవకాశాలను కనుగొనవచ్చని వెల్లడించారు.

మన పురాణాలు, ఉపనిషత్తులు చెప్పినవే ఇక్కడ ఫలితాలలో కనిపిస్తున్నాయి. పుక్కిటి పురాణాలుగా భావించిన వారంతా మనగ్రంథాల అధ్యయనానికి ముందుకు వస్తున్నారు. నాసా సంస్కృతం శ్లోకాలలో ఉన్న సారాన్ని తెలుసుకునేందుకు ప్రత్యేక ప్రాజెక్టులు పెట్టింది. ఒకసందర్భంలో అమృతాన్ని మండలంపాటు దాచాల్సిన సందర్భం వచ్చినప్పుడు చంద్రునిపైన దాచినట్లు పురాణప్రవచనం. ఆ సందర్భంలో చంద్రునిపై ఉష్ణోగ్రతను ఉటంకించారు. నేడు మనం తెలుసుకున్నదానితో మన ప్రాచీన గ్రంథాల సారంతో సరి పోల్చుకుంటే ఆశ్చర్యం కలుగుతోంది. సృష్టికి ప్రతిసృష్టి చేసిన విశ్వామిత్రుని చరిత్ర చెపుతోంది. కృత, త్రేత ద్వాపర యుగాలలో విశ్వాన్నిచుట్టి వచ్చినవారి వివరాలను పరిస్థితులను మన పురాణాలు చెపుతున్నాయి.

భారతదేశ విజ్ఞాన సంపద భావితరాలకు ఉపయోగపడేలా తీర్చి దిద్దుతున్నవేళ... చంద్రయాన్ ప్రాజెక్టు ఒక ముందడుగు.

–వొడ్డిపర్తి రామచంద్రమూర్తి (చీఫ్ ఎడిటర్)

# నెలవారి పంచాంగమ్

నిజ శ్రావణం 17-08-23 శుక్లపక్షం దక్షిణాయణంతో ప్రారంభమై 14-09-23 వరకు. తదుపరి భాద్రపదం.

13-09-2023 వరకు పుబ్బ కార్తె, 14-09-2023 నుండి 27-09-2023 ఉత్తర కార్తె. 28-09-2023 నుండి హస్తా కార్తె, **పండుగలు** : 03-09-23 సంకష్టహర చతుర్థి, 07-09-2023 శ్రీకృష్ణాష్టమి, 10-09-23 సర్వేషాం ఏకాదశి, 13-09-23 మాస శివరాత్రి, 14-09-23 పొలాల అమావాస్య, 16-09-23 శ్రీవారి బ్రహ్మోత్సవాలు 18-09-23 శ్రీవినాయక చతుర్థి, 19-09-23 ఋషి పంచమి, 25-09-23 సర్వేషాం ఏకాదశి, 26-09-23 వామన జయంతి, 28-09-23 అనంత పద్మనాభ వ్రతం. 30-09-23 మహాలయ పక్షారంభం.

## మాస ఫలాలు

**మేషం:** ఈ నెలలో అనుకూలంగా ఉన్నందున మీమాటకు తిరుగుండదు. అన్నింటా మీదే పై చేయి అగును. దైవ సంబంధ కార్యములు చేయుదురు.

**వృషభం:** ఈ నెల అనుకూలమే. అన్నింటా జయం, ఆదాయం బాగుంటుంది. పనులు త్వరితంగా పూర్తగును. వాహన సౌఖ్యం, ప్రతీ విషయంలో ధైర్యంగా ముందుకు పోగలరు.

**మిథునం:** ఈనెల ప్రశాంత వాతావరణం ఉంటుంది. అన్నిరంగాల వారికి చేయువృత్తి వ్యాపారాలందు రాణింపు ఉంటుంది. శుభమూలకంగా ధనవ్యయం జరుగును. ఆనందకర వార్తలు వింటారు.

**కర్కాటకం:** ఈ నెల అనుకూల సమయమే. మీదే పైచేయిగా ఉండును. దైవసంబంధ కార్యాలందు పాల్గొంటారు. వ్యవహార జయం, సంఘంలో పెద్దవారిని కలుసుకుంటారు.

**సింహం:** ఈ నెల కొంత అనుకూలంగానే ఉంది. చేయువృత్తి వ్యాపారాలు బాగుండును. ఆరోగ్య సమస్యలు ఉండవు. ఆర్థికంగా బాగుండును. సంతాన సౌఖ్యం, సంతోషంతో ఉంటారు.

**కన్య:** ఈ నెల పరిస్థితులు అంత అనుకూలించవు. మీరు చేయు ప్రయత్నములు ఫలించును. ధనము మాత్రం అవసరానికి ఏదో ఒకలా చేతికందును.

**తుల** : ఈ నెల కొంత అనుకూలత, ప్రతీ విషయంలోనూ అపజయమే. జీవనమునకు పరిస్థితులకు ఎదురీదవలెను. విపరీత ఖర్చులు అగును. వాహన ప్రమాదాలు,

**వృశ్చికం:** అన్నింటా విజయం, అనుకూలం ఉంటుంది. సంఘంలో ఉన్నత స్థితి, స్థిరాస్తులు వృద్ధి, దైవసంబంధకార్యాలకు ధనం ఖర్చు. అందరూ సహకారాలు అందించెదరు. సుఖముగా జీవనం.

**ధనుస్సు:** ఈనెల అనుకూలం. అన్నింటా విజయం, ధన లాభం, దైవసంబంధకార్యాలు చేయుదురు. భూ సంబంధ వ్యవహారాలు లాభించును.

**మకరం:** ఈ నెల అనుకూలం. చేయువృత్తి వ్యాపారాలందు అన్ని రంగములకు బాగుంటుంది. ఆర్థికంగా బాగుండును. సమస్యలు పరిష్కారమగును.

**కుంభం:** ఈ నెల అనుకూలంగా లేదు. ఆర్థిక సమస్యలుంటాయి. ధైర్యంగా ముందుకు పోలేరు. భూసంబంధ వ్యవహారములు అనుకూలించవు.


**మీనం:** ఈ నెల మిశ్రమ ఫలితములు, ఆదాయంనకు మించిన ఖర్చులు చేయుదురు. ఆరోగ్యం బాగుండును. ప్రతీవిషయంలో ఉద్రేకంగా ఉంటారు.

విష్ణు సహస్ర నామం సకల దోషాలను తొలగించే సంజీవని మహా ఔషధం. సకల వాంఛిత ఫలదాయని. ఆర్థిక ఇబ్బందులు తొలగాలన్నా, పిల్లలు సరిఅయిన దారిలో నడవాలన్నా, ఆరోగ్యం బాగుండాలన్నా విష్ణు సహస్ర నామం పారాయణం చేయాలి. సమస్త మానవాళిని ఉద్ధరించటానికి పుట్టిందే విష్ణు సహస్ర నామం. కీర్తి, శ్రేయస్సు దక్కి సకల శుభాలను కలుగజేస్తుంది.

## మంచి రోజులివిగో...

**నిజ శ్రావణ మాసం సెప్టెంబర్ 02, 03, 04, 07, 08, 09, 10, వివాహ, గృహ ఆరంభ, ప్రవేశ శుభ ముహూర్తములు.**

# ముత్తారం శ్రీ సీతారామచంద్ర స్వామి


**సేకరణ: నమిలకొండ రఘురామాచార్యులు**

శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం, గ్రామం ముత్తారం, మండలం శంకరపట్నం, జిల్లా కరీంనగర్. ఈ ఆలయము కరీంనగర్ జిల్లాకి 28 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. పూర్వము ముత్తారం గ్రామం దగ్గరలో ఉన్నటువంటి ఎరడపల్లి గ్రామ వాస్తవ్యులు అందరూ ఇంటి కఱ్ఱకొరకై గృహ నిర్మాణ నిమిత్తం దగ్గరలో ఉన్నటువంటి ఊర్లలో అడవిలో సేకరించుకునే వారు. అదే విధంగా ఒకరోజు వారు అడవికి వెళ్లి కట్టెలు కొట్టుకొని బాగా ఆలస్యమైందని రాత్రి అయిందని ఒకచోట విశ్రమించారు. తెల్లవారి వారు చూసేసరికి వారి యొక్క బండి ఎడ్లు కనబడకుండా పోయాయి. అడవి అంతా గాలించారు. తెల్లవారి రాత్రి అయ్యేసరికి అక్కడనే నిద్రించారు ఆ రాత్రి వారికి స్వప్నములో రామచంద్రస్వామి కనబడి నేను ఈ ప్రదేశంలో ఉన్నాను మీరు వెళ్లి మీరు



నా మూర్తులను తీసుకెళ్లి ప్రతిష్ఠించవలసిందిగా చెప్పారు. తెల్లవారి వారందరికి ఆ ప్రదేశంలో ఆవిధంగానే స్వామి యొక్క శిలామూర్తులు మరియు శివలింగము లభించాయి. అక్కడనే ఆ ఎడ్లు కూడా దొరికాయి. ఆ శిలామూర్తులను తీసుకొని వస్తుండగా ముత్తారం గ్రామానికి వచ్చేసరికి ముత్తారం గ్రామంలో గుట్ట దగ్గర ఎద్దులు కదల లేకుండా ఆగిపోయాయి. ఎంత ప్రయత్నం చేసినా బండ్లు కదలలేదు. ఆరోజు ముత్తారం గ్రామంలో వారు నిద్రించారు. స్వప్నంలో స్వామివారు కనిపించి గుట్టమీద ఈ విగ్రహాలను ప్రతిష్ఠించడని చెబుతారు. ఆ విధంగా ఆమూర్తులను గుట్టమీద దేవాలయంలో ప్రతిష్ఠాపన చేయడం జరిగినది. శివలింగమును గుట్ట కింద ప్రతిష్ఠించారు. అప్పటినుండి ఇప్పటివరకు ఎరడపల్లి గ్రామ వాస్తవ్యులు, ముత్తారం గ్రామ ప్రజలు కలసికట్టుగా దేవాలయంలో పూజా కార్యక్రమాలు బ్రహ్మోత్సవాలు జాతర కార్యక్రమాలు నిర్వహించుచున్నారు. ఈ దేవాలయంలో ప్రతి పునర్వసుకు స్వామివారి యొక్క అభిషేకం, కార్తీక మాసంలో తులసి కళ్యాణం, ధనుర్మాసంలో ధనుర్మాస ఉత్సవాలు, ప్రతి వైశాఖ పౌర్ణమికి జాతర కార్యక్రమాలు జరుగుతాయి. ఇక్కడ ప్రధాన అర్చకులు చిమిరాల బాలాజీ ఆచార్యులు, రాఘవాచార్యులు, శేషాచార్యులు, భరతాచార్యులు. వైదిక కార్యక్రమాలు వీరి నిర్వహణలో జరుగుతాయి. చుట్టు ప్రక్కల వారు మరియు గ్రామ ప్రజలు వచ్చి వారి యొక్క కోరికలను నెరవేర్చుకుంటారు.



# శ్రీరామానుజ సుధామాధురి

## మహిళా జన సేవిత రామానుజ

**- శ్రీమతి సముద్రాల శారద**

భగవంతుని ఉనికిని మనసా వాచా విశ్వసించని వారు దాదాపుగా ఉండరు. అయినా అంతరాంతరాల్లో భగవత్ సంబంధాన్ని అనుభూతి చెందటం వేద శాస్త్ర పురాణాంతర్గత ధర్మాన్ని విశ్వసించడం,అనుసరించడం మాత్రమే నిజమైన ఆస్తికత! ఇటువంటి భగవదైశ్వర్యం కంటే గొప్ప సంపద మరొకటి లేనేలేదని పెద్దల మాట! ఆ విధంగా సదాచరణ కలిగి భగవద్ ఆరాధనగా జీవించడమే చేతనుని లక్షణం కర్తవ్యం కూడా!



ప్రాపంచిక విషయాలపై విరాగం కలిగి భగవంతుని విషయాల యందు వ్యామోహం కలిగి జ్ఞానానుష్ఠానములే విధిగా కలిగి ఉన్నవారు, "స్నేహః పాప మాశంకతే" అన్నట్లు భగవత్ ప్రీతి పౌష్కల్యమ్‌తో పరమాత్మకే మంగళాశాసనం చేసిన వారు ఆళ్వార్లు. ఆ భక్తి మాధుర్యాన్ని అందరికీ పంచి భగవత్ ప్రాప్తి మార్గంలో వేలు పట్టి నడిపించిన వారు, సామాన్యులను కూడా సాధకులుగా చేసే అనుష్ఠాన విధానాలను ఉపదేశించిన వారు ఆచార్యులు. అటువంటి ఆచార్యులలో సమాజ హితాన్ని కాంక్షిస్తూ, సమత్వ స్ఫూర్తితో ఉద్ధరించే హృదయ మార్దవం కలవారు శ్రీరామానుజాచార్యులు. వారు వేద వేదాంత సారమగు తత్వ రహస్యమును ఎరిగినవారు కనుకనే అప్రతిహతమైన ప్రమాణ నిర్ధారణములతో హేతు బద్ధముగా సిద్ధాంత స్థాపన చేశారు. భగవద్రామానుజాచార్యులను సేవించి పారమార్థిక ప్రయోజనాన్ని పొందిన వారిలో ఎందరో మహిళా మణులు ఉన్నారు. ఆవృత్తాంతాలను మననం చేసుకుంటున్నాము.

**చేలాచెలాంబ:** సన్యాసాచార నిష్ఠులైన శ్రీరామానుజా చార్యులు శ్రీరంగ వాసం చేస్తున్నప్పుడు "మంత్ర రత్నాను సంధాన సంతత స్ఫురితాధరః" అని వీధిలో ద్వయ మంత్ర అనుసంధానం చేస్తూ సంచరించే వారట! "కాషాయ శోభి కమనీయ శిఖానివేశం" అని దివ్య మంగళస్వరూపంతో అత్యంత తేజస్సుతో విరాజిల్లేవారు. భక్త గణ సేవితులై శిష్యగణ పరివేష్ఠితులై భిక్షకై సంచరించే వారిని చూచి ఒక సాధారణ గృహిణి ఆశ్చర్య చకితురాలయింది. కర్ణాటక ప్రాంతానికి చెందిన కోయిల్ కొంగిలాచ్చన్, కొంగుపిరాట్టి (సుమతి) దంపతులు. వారి ప్రాంతంలో కరువు సంభవించగా శ్రీరంగానికి వలస వచ్చి నివాసం ఉంటున్నారు. ఆమెను చేలా చెలాంబ అని కూడా అంటారు. ఎందరో జనులు జగదాచార్యులను ఆశ్రయించడం మేడ పైనుండి చూచి ముగ్ధురాలయింది.

యతిరాజుల దరిచేరి ప్రార్థించింది. అందుకు కారణం "తమ వద్ద గొప్ప మంత్రం ఉందని, సంసార దుఃఖాన్ని తొలగించే మార్గం కోసం ఉపదేశాలు కోరి తమ వద్దకు వస్తారని భగవత్ విషయ వైభవమే ఇది" అని రహస్యాన్ని తెలియపరిచారు. ఆమెను ఆశ్రమానికి పిలిచి ఉపదేశించారు. ఆచార్య నిష్ఠతో ఆమె జగదాచార్యులను సేవించింది. తత్ఫలంగా వారి స్వంత గ్రామంలో వర్షాలు పడి పరిస్థితులు చక్కబడ్డాయని తెలిసి తిరుగు ప్రయాణానికి సిద్ధపడ్డారు.వెంటనే యతిరాజుల వద్దకు వచ్చి ప్రార్థించి మంత్రార్థాన్ని మరొకసారి సేవించింది. తాను స్త్రీ అయినప్పటికీ శ్రద్ధాసక్తులు, భక్తిప్రపత్తులు సాంప్రదాయ అనుసరణకు యోగ్యత కలిగిస్తాయని ప్రపంచానికి వెల్లడించింది. భగవద్ రామానుజాచార్యులు ఆమె ప్రార్థన మన్నించి తమ పాదుకలను ప్రసాదించారు. చాలా కాలం తర్వాత చోళ రాజుల దుశ్చర్యల మూలంగా శ్రీరామానుజాచార్యులు కొందరు శిష్యులతో కలిసి మేల్కోట ప్రాంతానికి ప్రయాణమయ్యారు. (మిగతా 7 వ పేజీలో)

# మహిళా జన సేవిత రామానుజ

**(6వ పేజీ తరువాయి)** రక్షణ కోసం కాషాయ వస్త్రాలు వదిలి శ్వేత వస్త్రధారియై బయలుదేరారు. మార్గమధ్యలో వారికి చేలాచెలాంబ ఆతిథ్యం ఇచ్చింది. ఆమె వండిన పదార్థములను తాను చిరకాలంగా పూజించే జగదాచార్యుల పాదుకలకు ఆరాధనగా నైవేద్యం సమర్పించింది.

రహస్య ప్రయాణం లో 15 రోజులుగా ఉపవసించి ఉన్న శిష్య బృందం ఆచార్యుల ఆజ్ఞతో తమలోనే ఒకరుగా శ్రీరామానుజాచార్యులు ఉన్నారని వారిని గుర్తుపడితే ఆహారం స్వీకరిస్తామని తెలిపారు. ఆనందించిన కొంగుపిరాట్టి పాదుకల సహాయంతోనే భగవద్రామానుజాచార్యులను గుర్తించి సేవించింది. ఆమె ఆచార్య భక్తికి సదాచరణకు సంతోషించి అనుగ్రహించారు యతిరాజులు. ఆమె భర్త అయిన 'కోయిల్ కొంగిలాచ్చియాన్'ను జగదాచార్యులు 74 మంది శిష్యగణంలో ఒకరుగా స్వీకరించారని చరిత్ర.

**తిరుక్కోళూర్ అమ్మాళ్:** తిరుక్కోళూర్ ఆళ్వార్‌తిరునగరి సమీపంలోని, మధురకవి ఆళ్వార్లను అనుగ్రహించిన, నవ తిరుపతుల్లో ఒకటైన పవిత్రమైన దివ్య దేశం. ఇక్కడి పెరుమాళ్ళ దివ్య సౌందర్యమును సదా దర్శిస్తూ ఉండాలని భక్తులు పరితపిస్తారట! ఆ దివ్య ప్రదేశాన్ని దర్శించి సేవించదలచి శ్రీరామానుజాచార్యులు శిష్యపరివారంగా ప్రయాణం అయ్యారు. మార్గంలో ఎందరో భక్తులు జగదాచార్యుల ఉపదేశాలను వింటూ సేవించుకుంటున్నారు. గ్రామ సరిహద్దులో ఒక స్త్రీ ఎంతో విషాదంగా ఆ దివ్య దేశం నుండి బయలుదేరిందట! మార్గమధ్యలో ఆమె జగదాచార్యులను సేవించుకుంది. గ్రామం విడిచి పోవుటకు కారణాన్ని యతిరాజులు ప్రశ్నించారు. ఆమె సమాధానం ఆధ్యాత్మిక భావనా సంపత్తి, విశ్లేషణ వారిని ఆశ్చర్యపరిచిందట! పూర్వా చార్యులు (తిరువాయి మొళి పిళ్ళై) రచించిన గ్రంథాల ద్వారా మహిళా జన సేవితులైన శ్రీరామానుజాచార్యుల చరిత్ర వైభవం, జ్ఞాన ప్రకర్ష గల మహిళా మణుల వృత్తాంతాలు తెలుస్తున్నవి.

తిరుక్కోళూరులో నివసించడానికి అనగా అటువంటి పవిత్ర దివ్య దేశాల్లో నివసించడానికి గొప్ప యోగ్యత కలిగి ఉండాలని అంతరార్థంగా 81 అలంకార చమత్కారంగా ప్రశ్నలను విన్నవించిందట! "తిరుక్కోళూర్ అమ్మాళ్ 81 వార్తలు" గా అవి ప్రసిద్ధమైనాయి. అక్రూర విదురాది భక్తుల వలె తాను భక్తురాలు కాదని, ఋష్యాదుల భార్యల వలె త్యాగనిష్ఠ లేదని, అలాగే కుచేలుని వలె, అగస్త్యుని వలె, సంజయుని వలె ఇలా అనేకమంది భక్తాగ్రేసరులను, పురాణ పురుషులను, ఆళ్వారాదులను ప్రస్తావిస్తూ వారి గొప్పతనాన్ని చెప్పి తన ఆకించన్యత్వాన్ని వివరిస్తూ ప్రార్థించిందట! ఆమె వేదాంత పురాణ పరిజ్ఞానానికి ముగ్ధులై వాత్సల్యంతో ఆమెను పుత్రికలా సంబోధించి, ఉపదేశించి అనుగ్రహించారు. ఆమెతో కలిసి జగదాచార్యులు తిరుక్కోలూరులో అడుగుపెట్టి దైవ దర్శనం చేసుకున్నారని చరిత్ర! ఎన్నో ఆధ్యాత్మిక సాంప్రదాయ రహస్యాలు ఆమె ప్రార్థనా విశేషాలలో వెల్లడించబడి సాధకుల సమస్యలకు సమాధానాలుగా నిలిచాయని పెద్దలు ప్రవచిస్తారు.

మహిళా జన సేవితులైన భగవద్రామానుజాచార్యుల ఉపదేశములతో పరిపక్వత పొంది ఎందరో కృతకృత్యులైనారని చరిత్ర తెలుపుతున్నది. సమస్ఫూర్తి గల సకల జనోద్ధరణమే లక్ష్యమైనది శ్రీరామానుజ మార్గము. ★

## కరీంనగర్‌లో శ్రీ వైష్ణవ కమ్యూనిటీ హాల్



గౌరవ మంత్రివర్యులు గంగుల కమలాకర్ గారి సహకారంతో ఇవ్వబడిన కరీంనగర్ జిల్లా శ్రీ వైష్ణవ కమ్యూనిటీ హాల్ నిర్మాణపనులు జరుగుతున్నాయి. శ్రీ వైష్ణవ వైదిక సేవా సంఘం, కరీంనగర్ ఆధ్వర్యంలో 900 చదరపు గజాల భూమిలో నిర్మాణ కార్యక్రమాలు చేపట్టారు. దీనికి డిప్యూటీ మేయర్ మరియు నగర బి ఆర్ ఎస్ అధ్యక్షులు స్వరూప రాణి, హరి శంకర్ స్థానిక కార్పొరేటర్ దిండిగాల మహేష్ సహకారంతో కమ్యూనిటీ హాల్‌కు 10 లక్షలు మంత్రిగారు కేటాయించడం జరిగింది. అనేక మంది వైష్ణవ బంధువులు సహకరించారు. మరియు అందరూ సహాయ సహకారాలు అందించగలరని శ్రీ వైష్ణవ వైదిక సేవా సంఘం కోరడం జరిగింది.



# శ్రీకృష్ణావతార ప్రాశస్త్యమ్

**శ్రీమాన్ శ్రీ కె. ఇ. స్థలశాయి, స్థానాచార్యులు**

**శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం భద్రాచలం**

భగవంతుడు ధరించిన అవతారములలో కృష్ణావతారము విశిష్టమైనది. అవతారియే కానీ అవతారము కాదు అని " కృష్ణస్తు భగవాన్ స్వయం" అంటూ శ్రీమద్భాగవతం పేర్కొంటూన్నది.

అంతేకాక

వసుదేవ గృహే సాక్షాత్ భగవాన్ పురుషః పరః।
జనిష్యతే తత్ప్రియార్థం సంభవన్తు సురస్త్రియః॥

'వసుదేవ గృహమందు సాక్షాత్తు భగవానుడగు పరమపురుషుడు ఆవిర్భవించును. ఆయన ప్రీతి కొరకు దేవతాస్త్రీలు వ్రజమున అవతరిస్తారు" అని,

వాసుదేవ కాలోనక్తః సహస్ర వదనః స్వరాట్।
అగ్రతో భవితా దేవో హరేః ప్రియ చికీర్షయా॥

భగవానుడైన వాసుదేవుని అంగమైన సంకర్షణుడు, దేశకాల సీమాది రహితుడనియు (అనంతుడు) అనంతనామములతో కీర్తింపబడు నానావిధములగు అవతారములు ప్రకటించువాడనియు, అంశయందు సహస్రవదనుడైన ఆదిశేషువనియు చెప్పబడు స్వయం ప్రకాశకుడగు ఆమూల సంకర్షణుడు శ్రీకృష్ణ భగవానునకు సేవచేయు తలంపుతో కృష్ణునికన్నా ముందే ఆవిర్భవించును. అని కృష్ణుని సాక్షాత్తూ భగవానుడు గానూ, ఆయనయొక్క అంశావతారము బలరాముడుగాను భాగవత పురాణం పేర్కొంటున్నది.

ఇక భగవానుని అవతారము లెందుకు? అంటే దానికి సమాధానంగా భగవత్‌గీత లో "పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం, ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే" అంటూ మూడు కారణములను శ్రీకృష్ణుడు చెప్పాడు. శిష్ట రక్షణ, దుష్టశిక్షణ, ధర్మసంస్థాపనములనే ఆ మూడు కారణములలో శిష్టరక్షణమే ప్రధానమైనది. దానికి అనుషంగములైనవి దుష్టశిక్షణ, ధర్మసంస్థాపన అను రెండు కార్యములు.

కృష్ణావతార ప్రారంభంనుండే ఈ శిష్ట సంరక్షణను భగవంతుడు అద్భుతంగా కొనసాగించాడు. అత్యంత సాధువులగు దేవకీ, వసుదేవులకు శంఖ, చక్రాలతో అవతరించుటయే ఒక అద్భుతం కదా!

నిశీథే తమ ఉద్భూతే జాయమానే జనార్దనే
దేవక్యాం దేవరూపిణ్యాం విష్ణుః సర్వగుహాశయః
ఆవిరాసద్యథా ప్రాచ్యాం దిశీన్దురివపుష్కలః
(శ్రీమద్భాగవతము)

"జనార్దనుడగు భగవానుడు అంధకారమైన నిశీథమున, తూర్పు దిక్కున ఉదయించు పూర్ణ చంద్రునివలె సర్వ జీవుల హృదయాలలో విరాజిల్లు విష్ణువు దేవరూపిణియైన దేవకీ గర్భమున ఆవిర్భవించెను".


తమద్భుతం బాలక మంబుజేక్షణం చతుర్భుజం శంఖ గదాద్యుదాయుధమ్।
శ్రీవత్స లక్ష్మం గళ శోభి కౌస్తుభం పీతామ్బరం సాన్ద్ర పయోద సౌభగమ్॥
మహార్హ వైదూర్య కిరీట కుండల త్విషా పరిష్వక్త సహస్ర కున్తలమ్।
ఉద్దామ కాంచ్యఙ్గద కంకణాదిభిః విరోచమానం వసుదేవ ఐక్షత॥

"పద్మముల వంటి నేత్రములు గలవాడు. చతుర్భుజుడు, శంఖచక్ర గదాద్యాయుధములు ధరించినవాడు, శ్రీవత్స మనే చిహ్నమును వక్ష స్థలమున కలవాడు, కౌస్తుభమనే మణిని కంఠమున ధరించినవాడు, పీతాంబరధారి, నీలమేఘమువలె నల్లనిమేని ఛాయతో సుందరమైనవాడు, మహామూల్యములగు వైదూర్య మణులచే ప్రకాశించు మకుటములు, కుండలముల కాంతిచే ప్రకాశించు ముంగురులు కలవాడు. అధికముగా ప్రకాశించు మొలత్రాడు, కేయూరములు, వలయములు మొదలగు అలంకారములచే శోభిల్లుచున్న ఆ అద్భుత బాలుని వసుదేవుడు వీక్షించెను". అని కృష్ణావతార ఘట్టమున వేదవ్యాస భగవానుడు వర్ణించాడు.

స్వాయంభువ మన్వంతరంలో పృశ్ని సుతపుడు అను దంపతులు తపస్సు చేయగా వారికి శ్రీమన్నారాయణుడు ప్రత్యక్షమై వరం కోరుకోమన్నాడు. అప్పుడా దంపతులు వాత్సల్య రసాస్వాదనమున మునిగి "నీవంటి పుత్రుని ప్రసాదించమని" ప్రార్థించారు. వారికా వరము ప్రసాదించి పృశ్ని గర్భుడను పేరుతో భగవానుడు అవతరించాడు. ఆ తరువాత ఆ పృశ్ని సుతపులే అదితి కశ్యపులుగా జన్మించారు. వారికి మరల భగవానుడే ఉపేంద్రుడను పేరుతో అవతరించాడు. (మిగతా 23 వ పేజీలో)

# శ్రీపతి స్తుతి

# సుభాషితం
## మంచి మాట



ప్రాతర్నిత్యాను సంధానంలో
## ‘కృష్ణాష్టకం’

(గత సంచిక తరువాయి)

పారిజాతాపహరణ అనే వృత్తాంతాన్ని ఆధారంగా చేసుకొని సత్యకు గల్గిన గర్వమును ‘శ్రీకృష్ణతులాభారం’ అనే పేరుతో తొలగించినట్లు మరొక చరిత్ర గూడా వుంది.

కృష్ణుని చిరునగవు లోపలి దంతముల కాంతులను విరజిమ్ముచు ఎంతటి వారినైనా మోహంలో ముంచివేస్తుంటుంది. దరహాసం ముఖానికి అందము నిస్తుంది కాని అది అందరికి కాదు. ఆ అదృష్టము కొందరికి మాత్రమే వుంటుంది. అది తెలియక నేటి కాలంలో ఫోటో గ్రాఫర్లు నవ్వండి, నవ్వండి అంటుంటారు. స్వామి కృష్ణునకు నాలుగు భుజములుంటవి. అందుకే పుట్టినప్పుడు “చతుర్భుజం” అని వ్యాస భగవానుడు వర్ణించాడు. ఐతే వసుదేవుడు

జాతోసి దేవ దేవేశ ! శంఖ చక్ర గదాధర।

దివ్యరూప మిదం దేవ ప్రసాదేనోపసంహర॥ అన్నాడు. తల్లి కూడా ‘ఉప సంహర విశ్వాత్మన్ రూప మేతత్ చతుర్భుజం’ అన్నది. తల్లి దండ్రుల కోరిక ననుసరించి కొంత కాలము రెండు చేతులను దాచుకున్నాడు. కాబట్టి నాల్గు భుజాలు కృష్ణునికి. చిన్నప్పుడు ఉట్టి మీది పాలు తోటివారికి పోసి పాలకుండకు కట్టిన గంట చప్పుడు కాకుండ ఒకచేత పట్టి వేరొక చేత కుండను వంచి దోసిలితో పాలు తాగినాడని ‘శ్రీకృష్ణ కర్ణామృతం’ లో లీలాశుకుడు ‘పీఠే పీఠ నిషణ్ణ’ … అనే శ్లోకంలో అద్భుతంగా వర్ణించి కృష్ణుని మన యెదుట సాక్షాత్కరింప చేస్తాడు. ఆ శ్లోక మాధుర్యం తర్వాత తెలుసుకుందాము. అట్లే యుద్ధరంగంలో అర్జునునకు ‘గీత’ ఉపదేశించే సందర్భంలో విశ్వరూపాన్ని చూపగా అర్జునుడు భయపడి ‘తేనైవరూపేణ చతుర్భుజేన’ అంటారు. ఏతావతా తేలింది ఏమిటి?

కృష్ణుడు చతుర్భుజుడు, ఎందుకు? అనే విషయం అడిగినవారు తెలుసుకోవడానికి. నాలుగు చేతులు ధరించాడు అనగా నాలుగు పురుషార్థములను ఇచ్చేవాడు అని, నెమలి పింఛము శిరోభూషణముగా గలవాడు. ఏమిటి ఈ నెమలి పింఛం? ఎందుకు ధరిస్తాడు? కృష్ణునికే ఎందుకు? అనేదానికి ఒక కథ వుంది. విందామా? ఒకప్పుడు కృష్ణుడు వేణుగానం చేస్తున్నాడు. ఆనందం పట్టలేక నెమలి పురి విప్పి నాట్యం చేయడం

**శ్రీమాన్ శ్రీ అమరవాది వేంకటనరసింహాచార్యులు**

ప్రారంభించింది. ఐతే ఈ పింఛం ఆడ నెమలికి ఉండదు. మగ నెమలికే ఉంటుంది. ఈయన గానం, నెమలి నాట్యం, ఇలా కొంతసేపు సాగింది. తర్వాత అలసిపోయి నాట్యం చాలించింది నెమలి. కృష్ణుని చూచి ‘నీ గానం నాకు చాల ఆనందాన్నిచ్చింది. దీనికి నీకు నేనేమివ్వగలను? నావద్ద ఏముంది? ఈ పింఛము, దాని కుండే ఈకలు తప్ప ఏమీ లేదు. కృష్ణా ! దయతో నా యీ ఈకను రాలుస్తున్నాను తీసుకోవా?’ అని వేడుకుంది. అందుకు తన్మయత చెంది ‘ప్రేమతో ఎవరు ఏమిచ్చినా నేను దానిని తలదాల్చుతాను’ అని దానిని శిరస్సునందు ధరించాడు అంటారు పెద్దలు. ‘పత్రం, పుష్పం, ఫలం, తోయం’ అన్నాడు గదా! గీతలో ఏదైనా ‘భక్త్యా ప్రయచ్ఛతి’ అనగా భక్తితో ఇవ్వాలి అంతే. అప్పటి నుండి ‘కృష్ణుడు అంటే నెమలి పింఛము వాడు’ అని రూఢి యేర్పడింది.

**5. శ్లో ఉత్ఫుల్ల పద్మ పత్రాక్షం, నీల జీమూత సన్నిభం**
**యాదవానాం శిరోరత్నం కృష్ణం వందే జగద్గురుమ్.**

ప్రతిపదార్థం: ఉత్ఫుల్ల = సంపూర్ణంగా వికసించిన, పద్మ పత్ర = తామర పుష్ప దళముల వంటి, అక్షం = నేత్రములుగలిగిన, నీలజీమూత సన్నిభమ్ = నీటితో నిండిన మేఘము వలె, సమానమైన కాంతి గలిగిన, యాదవానాం = యదు వంశీయులకు, శిరోరత్నం = తలమాణిక్యమైన, జగద్గురుం = లోకాచార్యుడైన, కృష్ణం = శ్రీకృష్ణుని, వందే = నమస్కరించు చున్నాను.

తాత్పర్యము: బాగా వికసించిన పద్మపత్రము వంటి నేత్ర సౌందర్యము గలవాడు. నీళ్లు నిండిన మేఘము వలె చూచే వారి కన్నులను చల్ల బరచు నట్టి శరీరం గలవాడు. యదు వంశీయులందరికి శిరోభూషణం వలె నున్నవాడు. లోక గురువు శ్రీకృష్ణునికి సమస్కరించుచున్నాను.

*మరికొన్ని విశేషాలు వచ్చే సంచికలో*

# శుభాశుభ నిర్ణయాలు-మీమాంస





శ్రీమాన్ శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి

**"శాస్త్రజ్ఞానం బహు క్లేశం బుద్ధేశ్చలన కారణం" అని పెద్దల మాట అందుకే విశేష శాస్త్ర పరిజ్ఞానం గల గొప్ప పండితుల ద్వారా విషయాంశములను అందించాలని శ్రీ సన్నిధానం పత్రిక సంకల్పం! శాస్త్ర విషయాలను వాస్తవ జీవితానికి సమన్వయించుకొని శుభ ఫలితాలను పొందాలని ఈ శీర్షిక ప్రారంభించబడింది. ఉభయ తెలుగు రాష్ట్రాలలో ప్రముఖులు. జ్యోతిష్య వాస్తు ఆగమ శాస్త్రముల యందు, ఉభయ వేదాంతములందు పండితులు విశేషించి పంచాంగ కర్తలు శ్రీమాన్ శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి గారి ద్వారా గొప్ప సమాచారంతో పాఠకుల కోసం ప్రారంభించబడింది.**

శ్రీమతే రామానుజాయనమః

**దేవతాశ్చ నరాశ్చైవ యస్మిన్ దేశే పరిస్థితాః।**
**తద్వస్తు సూరిభిః ప్రోక్తం తథావై వక్ష్యతేదునాః॥**

దేవతలు మనుష్యులు మొదలగు వారు నివసించ దగిన భూమి "వస్తు" వనబడును "వస్తు సంబంధి శుభాశుభం శాసయతీతి వాస్తు శాస్త్రం"

వాస్తు శాస్త్రమనగా దేవతలు, మనుష్యులు మొదలగు వారు నివసించు భూమి యొక్క శుభాశుభ మిశ్ర ఫలములను నిరూపించుచు యోగ్యతాయోగ్యతలను శాసించునది. "వస్తు అధికృత్య కృతం శాస్త్రం" దేవతలు మనుష్యులు నివసించదగిన భూమిని ఆధారముగా గొని ఆభూమిలోని గుణదోషములను నిరూపించు శాస్త్రము. పంచభూతములలో ఆది భూతము, చరాచరమగు సమస్త ప్రపంచమునకు ఆధారభూతమగుట వలన "భూమి" ముఖ్యవస్తువుగా పరిగణింప బడుచున్నది.

**సర్వేషా మపి వస్తూనాం ఆధారం భూతలం స్మృతం॥**
**తస్మాత్ప్రాగుక్త, వత్కుర్యాద్భూమి సంగ్రహణం బుధః॥**

సర్వవిధములగు వాస్తుకు భూమియే ముఖ్యాధారము.

**"వసనివాసే- వాస్తో శ్యాస్త్రమితి వాస్తు శాస్త్రం"**

ఈ భూమి నుండి జనించినటువంటి సంశ్రయ మైనటువంటి నగరములు, గ్రామములు, గృహములు, సౌధములు, దేవాలయములు, ప్రాకారములు, గోపురములు, యానములు, శయనములు, కూపములు, తటాకములు, ఆరామములు, శల్యములు, నిక్షేపములు యివన్నియు వస్తు భాగములగుటవల్ల నిర్ణయములను, పరిమాణములను, ప్రమాణములను, ధర్మములను వాటి వలన కలుగు శుభాశుభ ఫలములను, గుణదోషములను, వృద్ధి క్షయములను నిరూపించి శాపించు శాస్త్రమే వాస్తు శాస్త్రము. అని మనకు పెద్దలను గ్రహించారు. వీటిని తెలుసుకొని ఆచరించడం మన కర్తవ్యము.

**ఏ లక్షణములు కలవారిని గృహస్థుడందురు?**

దయ, శ్రద్ధ, ఓర్పు, లజ్జ, సదసద్వివేకము, త్యాగము, కృతజ్ఞత మొదలయిన గుణ సంపద కలవారిని ఉత్తమ గృహస్థుడని పిలుస్తారు. -(వ్యాసమహాముని)

**గృహస్థాశ్రమము ఎందుకు శ్రేష్ఠము?**

వానప్రస్థులు, బ్రహ్మచారులు, సన్యాసులు, ద్విజులు మొదలగు వారు గృహస్థుని ఆధారము చేత తమతమ ఆశ్రమ ధర్మములను నెరవేర్చుకుంటూ జీవించుచున్నారు. కావున గృహస్థాశ్రమము చాలా శ్రేష్ఠమైనది అని పరాశరులు అనుగ్రహించారు.

**గృహనిర్మాణము యొక్క అవశ్యకత, ప్రయోజనమేమి?**

సమస్త ప్రాణుల కాశ్రయమైనది, ధర్మార్థ కామములను సమకూర్చునది, సతీ సుతాదులను భోగ సౌఖ్యములను కల్గించునది, వర్షము, ఆతపము, శీతలము మొదలగు

వాటివలన కలిగే బాధలను తొలగించునదిగా వుండేదే గృహము. గృహాన్ని నిర్మించడము వలన కూపము, దేవ గృహము మొదలగు వాటిని నిర్మించినంతనే మహాపుణ్యము సంప్రాప్తిస్తుంది. గృహస్థాశ్రమకారుడయిన గృహస్థుడు అన్ని కార్యములకన్న ముందుగా గృహనిర్మాణము కావించాలి అని మన పూర్వుల చేత చెప్పబడినది. (వాస్తు రాజ వల్లభం)

గృహస్థుడు తన గృహమున నివాసము వుంటూ గృహస్థాశ్రమమునకు నియమింపబడిన సమస్త క్రియలను నెరవేర్చుకుంటేనే అవి ఫలవంతమవుతాయి.

తన గృహమునందు కాకుండా ఇతరుల గృహమందు నివసిస్తూ తన విధులను, శుభఫలములనిచ్చు శ్రౌత స్మార్తాది కర్మలను నెరవేర్చినచో అవి తనకు ఫలవంతములు గావు అవి నిష్ఫలమవుతాయి. ఆ ఫలములు భూమీశుడు అనగా గృహ యజమానికి గలుగజేస్తాయి. -(మత్స్యపురాణం, భవిష్యోత్తర పురాణము)

*మరికొన్ని శుభా శుభ నిర్ణయాలు వచ్చే సంచికలో*

# బీర్పూర్ లో శ్రావణ మాస ప్రత్యేక కార్యక్రమాలు



సేకరణ: హేమంతాచార్యులు

ఈ సంవత్సరం శ్రావణ మాస శుద్ధ ఏకాదశి నాడు ఆదివారం రోజున బీర్పూర్ గ్రామమందు వెలసిన లక్ష్మీనరసింహస్వామి వారి విశేష అభిషేక కార్యక్రమం జరగబోతుంది. ఈ కార్యక్రమం ప్రతి సంవత్సరం కేవలం ఒక్కరోజు మాత్రమే జరుగుతుంది. బీర్పూర్ నందు రెండు గుట్టలు కలిగి ఉన్నవి. అందులో చిన్నగుట్టలో సంవత్సరం అంతా ఆరాధనాదికాలు జరుగుతుంటాయి, సౌలభ్యం భక్తులకు చాలా ఉంటుంది. కానీ పెద్ద గుట్ట పైన ఎలాంటి కోవెల గాని ఎక్కడానికి మెట్లు కానీ రహదారి మార్గం కానీ లేదు. కేవలం గుట్ట మొత్తం కూడా అడవి ప్రాంతం. ఆ చెట్లను పట్టుకొని మనం మార్గాన్ని వెతుక్కుంటూ పైకి వెళ్లాలి. పైకి వెళ్ళిన తర్వాత పైన స్వామివారికి ఒక కోనేరు, భక్తులకు ఒక కోనేరు, రెండు ఉంటాయి. అభిషేకం అయ్యేంతవరకు ఎవ్వరూ కూడా ఆ నీటిని తాకరు. భక్తుల కోనేరు లో ఉన్నటువంటి నీటిని మాత్రమే అందరూ వాడుకుంటారు. స్వామివారికి అభిషేకం, అలంకారం పూర్తయిన తర్వాత అర్చనలు, స్వామివారి అష్టోత్తర సేవలు జరిగిన తర్వాత వరద పాయసం అనే ఒక ఆనవాయితీగా వస్తున్నటువంటి కార్యక్రమాన్ని కూడా జరుపుతారు. స్వామివారికి నివేదన చేసినటువంటి పాయసం ఒక బండపై నుంచి క్రిందికి ధారలాగా పోస్తారు తద్వారా స్వామి వారు అందరికీ మంచి జీవితం సస్యశ్యామలమైనటువంటి పాడిపంటలు ప్రసాదిస్తారు. అలానే వర్షాలు మంచిగా పడి అందరూ కూడా బాగుంటారు. గ్రామప్రజలు, చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లో ఉండే భక్తులు కూడా ఈ కార్యక్రమానికి వచ్చి స్వామిని దర్శించుకొని, అభిషేకంలో పాల్గొని, స్వామివారి అనుగ్రహాన్ని పొందుతూ ఉంటారు. స్వామి వారి ప్రసాదాన్ని అక్కడ చేసినటువంటి వంటలను తదీయారాధనగా స్వీకరిస్తారు. అందరూ కలిసి స్వామికి మళ్లీ వచ్చే సంవత్సరం అంతా బాగుండాలని నమస్కారం చేసుకొంటారు. ఈ కార్యక్రమాన్ని ఈ సంవత్సరం శ్రావణ మాస శుద్ధ ఏకాదశి ఆదివారం రోజున జరుగుతూ ఉంది. ఆ విశేష కార్యక్రమానికి ఎంతో మంది భక్తులు ఆసక్తితో వస్తారు.



## నర్సింగ్ పల్లి (నిజామాబాద్ జిల్లా)
## శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి

ఆలయంలో శ్రావణమాస శుక్రవారం మహాలక్ష్మీ అలంకార స్నపనం 25-08-2023 శుక్రవారం



# భూలోకం, వైకుంఠం కొలిచే కొండ



## శ్రీమాన్ శ్రీ డాక్టర్ ఈ.ఏ. శింగరాచార్యస్వామి

పరమపదనాథుడు దయాస్వరూపుడై పరమపదంలో కైంకర్య మహా సామ్రాజ్యాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా పరిపాలించేవాడై ఉన్నప్పటికీ తన పరత్వ స్వరూపాన్ని మరగుపరచుకొని భూలోకానికి దిగివచ్చాడు. తనను శరణు పొందే భక్తుల విషయంలో కలిగి ఉండే పక్షపాతంచేత వారు తనను ఆశ్రయించటానికి వీలుగా "శ్రీవైకుంఠ విరక్తాయ స్వామి పుష్కరిణీతటే, రమయా రమమాణాయ" అనే విధంగా భూలోకానికి దిగివచ్చి శ్రీనివాస రూపాన్ని ధరించి తిరుమలలో నిత్యవాసం చేస్తున్నాడు. ఆ భగవానుని విశ్లేషాన్ని సహించలేని నిత్యులు, ముక్తులు కూడా ఆ తిరుమల కొండపై స్థావర జంగమరూపాలను పరిగ్రహించి, అక్కడే నిత్యవాసం చేస్తూ శ్రీనివాస స్వామికి నిత్య కైంకర్యం చేస్తున్నారు.

నమ్మాళ్వార్లు తిరువాయ్ మొళి దివ్య ప్రబంధంలో (1-8-1)




"కణ్ణావాన్ ఎన్రుమ్ మణ్ణోర్ విణ్ణోర్ క్కు, తణ్ణార్ వేంగడ విణ్ణోర్ వెఱ్పనే" అనే ఒక దివ్యసూక్తిని అనుగ్రహించారు. తిరుమల అనే పర్వతం ఎటువంటిది? అంటే, ఈ భూలోకంలో నివసించే వారికి పరమపదం లో నివసించే వారికి అందరికీ సేవించదగిన స్థలంగా వెలుగుతున్నది. శ్రీనివాస ప్రభువు ఈ రెండు లోకాలవారికి సమానంగా తన దర్శనాన్ని అనుగ్రహిస్తున్నాడు అని ఈ సూక్తిలో ఆళ్వారులు తెలుపుతున్నారు. ఈ సూక్తిలోని అర్థాన్ని అనువదిస్తూ వేదాంత దేశికులు " విణ్ణవరుమ్ మణ్ణవరుమ్ విరుంబుమ్ వెఱ్పు" (పరమపదవాసులు, భూలోక వాసులు కొలిచే కొండ) అని అన్నారు.

భగవంతునకు పరత్వం, సౌలభ్యం అనే రెండు అసాధారణమైన లక్షణాలు ఉన్నాయి. చాలా ఎత్తుగా ఉండే పర్వతంలో నెలకొని ఉండడం చేత పరత్వం, చాలా తక్కువవారం అయిన మనవంటివారికి కూడా తన దర్శనాన్ని అనుగ్రహించడం వల్ల సౌలభ్యం అనే ఈ రెండు గుణాలు శ్రీవేంకటేశ్వరునిలో ప్రకాశిస్తున్నాయి. శ్రీనివాస ప్రభువులో లెక్కలేనన్ని కళ్యాణ గుణాలు ఉన్నప్పటికీ, అతనిలో మిగిలిన గుణాల కంటే, దయ అనే గుణం చాలా విలక్షణమైనది. ఆ దయ కారణంగానే ఆ స్వామికి ఉత్కర్ష కలుగుతున్నది.

దయాగుణ వికారమే సౌలభ్యమనే గుణం. వేంకటేశ్వరస్వామిలో ప్రకాశించే ఈ గుణాన్ని తిరుప్పాణ్ ఆళ్వారులు అమలనాది పిరాన్ అనే తమ ప్రబంధంలో "మంది పాయ్ వడ వేంగడ మామలై వానవర్ కళ్ శంది శెయ్య నిన్డాన్" (ఆడవానరాలు సంచరించే, ఉత్తర దిక్కులో ఉండే వేంకటాద్రిపై భగవానుడు శ్రీనివాసుడై, పరమపదవాసులు ఆరాధన చేయగా నిలచి ఉన్నాడు) అని అంటూ, మానవులకే కాక, తిర్యక్కులకు కూడా తన దర్శనాన్ని అనుగ్రహించే రీతిలోని సౌలభ్యగుణాన్ని కలిగినవాడు అని అన్నారు.


ఈ దయాగుణ ప్రకారమే వాత్సల్యం అనే గుణం కూడా. శ్రీవేంకటేశ్వర స్వామిలో ఉజ్జ్వలంగా వెలిగే ఈ వాత్సల్య గుణాన్ని నమ్మాళ్వార్లు "నిగరిల్ పుగళాయ్" (సాటి లేని వాత్సల్యం అనే కళ్యాణ గుణాన్ని కలిగినవాడై) అని కీర్తించారు.

పరమపదానికి, భూమికి మధ్యలో తిరుమల కొండపై వేంకటేశ్వరుడు వేంచేసి ఉండడం అనేది ఆ స్వామిలోని వాత్సల్య గుణాన్ని ఏ విధంగా ప్రకాశింప చేస్తున్నది? అనే విషయాన్ని మన పూర్వాచార్యులు ఒక అందమైన దృష్టాంతంతో వివరించారు. ఇద్దరు బిడ్డలను కలిగిన తల్లి ఏ విధంగా ఆ ఇద్దరు బిడ్డలను తనకు రెండు వైపులా పెట్టుకొని, ఆ ఇద్దరికి పాలను ఇచ్చి పోషిస్తుందో, ఆ విధంగానే భూలోకవాసులకు, పరమపదవాసు లకు ఇద్దరికీ తల్లివంటివాడైన శ్రీవేంకటేశ్వరుడు ఆ రెండు లోకాలకు మధ్యలో నిలచి ఉండి, రెండు లోకాలలోని వారికి తన దర్శనాన్ని అనుగ్రహిస్తూ, తన వాత్సల్యగుణాన్ని ప్రకాశింప జేస్తున్నాడు అని వివరించారు.



శ్రీనివాసస్వామిలో ప్రకాశించే దయాగుణాన్ని విశేషంగా స్తుతిస్తూ, వేదాంతదేశికులు అనే పూర్వాచార్యులు దయాశతకం అనే ఒక అద్భుతమైన స్తోత్రాన్ని అనుగ్రహించారు. ★

# జ్యోతిర్విజ్ఞానమ్



## శ్రీమాన్ శ్రీ నంబి వేణు గోపాలాచార్య కౌశిక

శ్రీసన్నిధానం పాఠకులు మీ జ్యోతిష్య శాస్త్ర సందేహాలను ప్రశ్నగా మాకు పంపండి, పరిష్కారాలను పొందండి! ఈ విజ్ఞానామృతాన్ని మీరూ ఆస్వాదించండి!!

(గత సంచిక తరువాయి) **వర్ణ వాస్తు**

గత సంచికలో స్థానవాస్తు గురించి కొంత తెలుసుకున్నాము. దాని తరువాత వర్ణ వాస్తు. అనగా రంగులు. పువ్వులలో, పండ్లలో రంగులు గమనించినట్లు, భూమి కూడా అనేక రంగులు గలదిగా గమనించవచ్చు. అలాగే మనుషులలో రంగు రంగుల వారిని చూస్తున్నాము. ఎరుపు, తెలుపు, చామనచాయ., పసుపు, నలుపు శరీర వర్ణములను చూస్తున్నాము.


అదే మాదిరి భూమి కూడా ఎరుపు, తెలుపు, పసుపు, బూడిద వర్ణం, నలుపు ఇలా రంగులను భూమిపై తెలుసుకోవచ్చు. ఇవి గ్రహములకు సంకేతములని జ్యోతిష్యశాస్త్రంలో భాగమైన వాస్తుశాస్త్రం తెలుపుచున్నది. రవి గ్రహమునకు పాటల వర్ణం (గులాబీ తో కూడిన ఎరుపు), చంద్రునకు పసుపు రంగులో కూడిన తెలుపు, కుజునకు ముదురు ఎరుపు, బుధునికి ఆకుపచ్చ రంగు (అనగా ఇసుకలో ఈ రంగు కనిపించును), గురువుకు స్వర్ణ ఛాయ గల భూమి, శుక్రునకు తెల్ల సుద్దభూమి, శనికి నలుపు నేలలు, రాహువునకు బూడిదరంగు నేలలు, కేతువునకు చిత్ర వర్ణములు గల రాళ్ల నేలలుగా వర్ణ వాస్తు నిర్ణయం ఉంటుంది. ఈ నేలలు ఎవరు ఎలా వారి గృహ నిర్మాణములు గాని, ఆలయ, విద్య, వైద్య, న్యాయ ధర్మాలయాల నిర్మాణములో ఎలా వీటిని ఉపయోగించాలి అనేది వాస్తుశాస్త్రము తెలిపినది. వర్ణమునకు మనుషులకు సంబంధం గురించిన విధము. వారి వారి దశలను, రాశులను బట్టి వర్ణ నిర్ణయము ఉంటుంది. ముందుగా దశలను బట్టి అశ్విని, మఖ, మూల కేతుదశ. భరణి, పుబ్బ, పూర్వాషాఢ శుక్రదశ. కృత్తిక, ఉత్తర, ఉత్తరాషాఢ రవి దశ. రోహిణి, హస్త, శ్రవణం చంద్ర దశ. మృగశిర, చిత్త, ధనిష్ట కుజదశ. ఆరుద్ర, స్వాతి, శతభిషం రాహుదశ. పునర్వసు, విశాఖ, పూర్వాభాద్ర గురు దశ. పుష్యమి, అనురాధ, ఉత్తరాభాద్ర శనిదశ. ఆశ్లేష, జ్యేష్ట, రేవతి బుధదశ. దీనిని బట్టి వారి వారి దశానాథుల వర్ణములు గల మట్టిపై నిర్మాణములు ఒక పద్ధతి. దీనినే స్థల పరిశీలన అందురు.

మరియొక విధానము జన్మ రాశుల ప్రకారం. మేష, వృశ్చిక రాశుల వారికి ఎరుపు భూమి. వృషభ రాశుల వారికి తెలుపు భూమి. మిథున, కన్యా రాశుల వారికి ఇసుక నేల. కర్కాటక రాశి వారికి పసుపుతో కూడిన తెలుపు (క్రీం) నేల. సింహ రాశి వారికి గులాబి తో కూడిన ఎరుపు నేల. ధనుర్ మీన రాశుల వారికి స్వర్ణ ఛాయ గల పసుపు నేల. మకర కుంభ రాశుల వారికి నలుపు నేల.

మరి అయితే చాలా రాశుల వారు ఒకే గృహంలో నివసించవలసియుండును కదా! అలాంటప్పుడు ఒక రాశికి సంబంధించిన ఒక వర్ణం (రంగు గల) భూమిపై గృహ ఇత్యాది నిర్మాణములు చేయునప్పుడు అన్ని రాశుల లేదా దశ క్రమములో ఆ భూమిని అందరికీ ఎలా పొసగుతుంది అని మనం ప్రశ్నించుకోవచ్చు. దీనికి సమాధానంగా శాస్త్రకారులు ఒక శాస్త్రీయ నిర్ణయం చేసినారు. ఒకే గృహములో వివిధ రాశుల, దశలు. వారి అందరికీ వర్ణ వాస్తు ఫలము సమానముగా ఫలించు విధానము నిర్ణయించినారు.

వివరణ : ఏదో ఒక స్థలాన్ని నిర్మాణమునకు ఎంచుకుని పునాదులు తీసి రాతి కట్టడం లేదా పిల్లర్ భీమ్ లెవెల్ వచ్చిన పిదప దానిలో మట్టి నింపి (బరంతి) అప్పుడు గోడల పని ప్రారంభించుట మనం గమనిస్తాం. సిమెంటు నిర్మాణం జరిగిన పిదప అందులో పోసే మట్టి గ్రహముల వర్ణములు, గ్రహముల స్థానములను బట్టి బరంతి మట్టి నింపుతారు. గృహ స్థలము 9 భాగములుగా ఏర్పరిచి ఒక్కో భాగము ఒక్కో గ్రహ స్థానముగా నిర్ణయించాలి.

(తరువాత భాగంలో మట్టిని నింపే విధానం మరియు దానిని తెలిపే చిత్రం రూపంలో చూడవచ్చు)(మిగతా వచ్చే సంచికలో...)



# సందేహాలు - సమాధానాలు

**నిత్యజీవితంలో ఎదురయ్యే జ్యోతిష్య, ఆధ్యాత్మిక, శాస్త్ర సంబంధమైన ధార్మిక సందేహాల నివృత్తికై శ్రీసన్నిధానం వేదికగా ఆయా పండితుల ద్వారా సమాధానాలు తెలుసుకోవచ్చు. ఇది పాఠకుల కోసం సరికొత్త శీర్షిక!. ఈ నెల పాఠకులు అడిగిన ప్రశ్నలకు శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక గారి సమాధానాలు.**

★ ప్రశ్న: నూతన గృహ ప్రవేశం రోజు మూడు హోమ కుండాలు, విడి విడిగా వేసి, రుద్ర హోమం, వాస్తు హోమం, సుదర్శన హోమం చేయవచ్చా? సుదర్శన హోమం చేసుకున్న సమయంలో హోమకుండం (స్థండిలం) చక్ర ఆకారంలో వేయవచ్చునా?

★ జవాబు: గృహప్రవేశ సమయంలో ప్రధానంగా వాస్తు హోమం చేసుకోవడం అనేటువంటిది శాస్త్రంలో చెప్పిన విధానం. వారి వారి సంప్రదాయాల ప్రకారంగా కొందరు సుదర్శన హోమం, కొందరు గణపతి హోమం, కొందరు రుద్ర హోమం ఇంకా ఇతరత్రా చేసుకొంటారు. ఏక కాలంలో మూడేసి హోమాలు జరుపుకున్నప్పుడు, ఒకటే రోజు జరుపుకొంటే స్థండిలమ్, అంతకు మించి మూడు లేదా ఐదు రోజులు చేస్తే హోమ కుండం వేసుకోవాలి. కుండాలు వేరువేరుగా ఉన్నపుడు మంత్ర సాంకర్యం కలగకుండా ఉంటే చాలు. ఒకే కుండంలో అనేక మంత్రాలను చేయటానికి శాస్త్రం అంగీకరించదు.

★ ప్రశ్న: నూతన గృహ ప్రవేశం చేసినరోజున వాస్తు పురుషుని బొమ్మ వేసి వాస్తు హోమం చేయవచ్చా?

– నమిలకొండ రఘు, కొండపలకల

★ జవాబు: గృహప్రవేశ సమయంలో వాస్తు శాంతి చేసినప్పుడు, సహజంగా ఆలయాలల్లో భగ్న, నష్ట, దుష్ట విపరీత, శ్వాల, బిడాలాది ప్రవేశ నిర్గమన దోష నివృత్యర్థం అని ఆగమ ప్రమాణానుసారంగా వాస్తు పురుషుని యొక్క హోమం, అది ఏ నెలలో శిరస్సు ఎటువైపు వుంటుందో శాస్త్రంలో చెప్పివుంది. ఆ దిశకు శిరస్సు వేసి హోమ క్షేత్ర పాలకుని యొక్క రూపం వేసి ఆరాధించడం సంప్రదాయం. గృహాలలో మండలం వేసి కేవలం మంత్ర సహితంగా వాస్తు శాంతి చేయడం అనేది చెప్పబడి యున్నది. ఇండ్లలో వాస్తు పురుషుని బొమ్మ వేయడం అనేది శాస్త్రంలో లేదు.

★ ప్రశ్న: ఎవరైనా ఇల్లు కొనేందుకు కానీ అద్దెకు వెళుటకు గానీ ఊరచ్చుబాటు చూసుకోవడం తప్పనిసరా? అలాంటప్పుడు హైదరాబాద్ లాంటి మహానగరంలో ఇది సాధ్యమా? రామకృష్ణ పేరిట (జన్మనక్షత్రం: రోహిణి) ఏ అక్షరంతో మొదలయ్యే ఊరు మరియు ఏ ముఖం గల ఇల్లు కొనవచ్చునో కాస్త విపులీకరించ ప్రార్థన ?

– రామకృష్ణ, హైదరాబాద్

★ జవాబు: గ్రామార్వణం చూడాలని జ్యోతిష్య శాస్త్రంలో వుంది. గ్రామార్వణం అనగా సుమారుగా రెండువేల జనం నుండి ఐదు వేల జనం వరకు ఉండేది. అంతకంటే ఎక్కువ ఉన్నపుడు అది పట్టణం అవుతుంది. పట్టణార్వణం, నగరార్వణం అని ఎక్కడా శాస్త్రంలో చెప్పివుండలేదు. కనుక పట్టణాల్లో దిశార్వణం చూసుకోవాలి. ఏ దిశలో ఉంటే బాగుంటుంది అనేది దిశార్వణం. కనుక పట్టణాలకు నగరాలకు (ఊరచ్చుబాటు) వర్తించదు. అడిగిన ప్రశ్న ప్రకారం రోహిణీ నక్షత్రం వాళ్లకు తూర్పు ముఖం విశేషం. ఇందులో నామ నక్షత్రం "వ" కారం మీద వస్తే దక్షిణ ముఖం ఇల్లు కట్టుకోవచ్చు అని శాస్త్రంలో చెప్పబడివుంది.

★ ప్రశ్న: సర్పదోషం పూజల ద్వారా తొలగించుకోవచ్చా?

– అప్రకటితం

★ జవాబు: జీవితములో సహజముగా జరిగేటివంటివి కాకుండా కొంచెం వెనకా ముందుగా జరిగేటి వంటిదానిని కాల సర్ప దోషమని చెపుతుంది జ్యోతిష్య శాస్త్రం. ఈ కాల సర్ప దోషం అనేక రకాలుగా వుంటుంది. సవ్యమని, అపసవ్యమని మరియు ఈ దోషం దేనిమీద వర్తిస్తుంది అనగా అది విద్య, ఆరోగ్యం, సంతానం, వివాహం, ఉద్యోగం, జీవన విధానం మీదనా అనేటువంటిది. దానికి ఏ సమయంలో ఏ శాంతి చెయ్యాలి అనే విషయాన్ని కూడా ప్రత్యక్షంగా జ్యోతిష్యుల ద్వారా సంప్రదిస్తే తెలుస్తుంది. ★

# ఆళ్వారెంబెరుమానార్ దివ్య తిరువడి గళే శరణం



శ్రీమతి గుండు మహాలక్ష్మీ రాణి

పూర్వాచార్య పరంపరకు చెందినవారు శ్రీ కూరేశులు. వారిని కూరత్తాళ్వాన్ అని కూడా అంటుంటాము. వీరు భగవద్రామానుజాచార్యుల శిష్యులలో అగ్రగణ్యులు. శ్రీకూరేశులు శ్రీరామానుజులను సమాశ్రయించిన పిమ్మటనే రామానుజుల కీర్తి ఇనుమడించినట్లు శ్రీ రామానుజ నూత్తన్దాది ప్రబంధములో "మొజియై కిడక్కుమ్" అను పాశురము వలన తెలుస్తున్నది. ఈ మహనీయులు సత్కులములో జన్మించారు. బహుముఖ ప్రజ్ఞాశాలి ఏక సంథాగ్రాహి. సదాచార పరాయణులు. సదాచార సచ్ఛిష్య లక్షణములు కలవారు. శ్రీభాష్య గ్రంథ ఆవిష్కరణకు మూలపురుషులు. అటువంటి కూరేశమిశ్రులకు శ్రీరంగనాథన్ శ్రీరామ మిశ్రులను ఇద్దరు కుమారులు. వారికి రామానుజాచార్యులు పరాశర వ్యాసభట్టారకులను నామాన్ని ఉంచారు.

వ్యాసభట్టర్‌కు సర్వజ్ఞ భట్టర్, వాగ్విజయ భట్టర్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో సర్వజ్ఞ భట్టర్ అనే వారు "కూరేశ వింశతి" అను స్తోత్రాన్ని అనుగ్రహించారు. వీరికి పెద్ద తండ్రిగారైన పరాశర భట్టారకులే వీరి ఆచార్యులు. వీరు శ్రీరంగ క్షేత్ర మధ్య వీధిలో నివసించుట చేత "నడివిల్ తిరువీధి భట్టర్" అనే పేరుతో పిలిచేవారు. వీరి ప్రాచార్యులైన కూరేశుల యందు గల భక్తి భావము చేత వారి గురించి వాచికా కైంకర్యం చేసి జన్మ ధన్యము చేసుకున్నారు. సర్వజ్ఞ భట్టారకులు కూరేశ మిశ్రులకు ఆళ్వార్లయందు గల భక్తిని, ఆపై భగవద్రామానుజులయందు గల భక్తిని వివరిస్తూ ఈ విధంగా అద్భుత భావాన్ని తెలియజేస్తున్నారు.

**"భక్తి ప్రభావ భవదద్భుత భావ బంధ**
**సంధు క్షిత ప్రణయ సార రసౌఘ పూర్ణ**
**వేదార్థ రత్న నిధి రచ్యుత దివ్య ధామా**
**జీయాత్ పరాంకుశ పయోధి రసీమ భూమా"**

కూరేశ మిశ్రులను ఈ శ్లోకంలో నమ్మాళ్వార్ల వలె సముద్రంతో పోల్చి వర్ణిస్తున్నారు.


సముద్రము జల ప్రవాహములతోనూ రత్నాలతోనూ నిండి ఉంటుంది. అందుకే సముద్రానికి ఉదధి అని, రత్నాకరమని పేర్లు ఇంకా శ్రీమహావిష్ణువుకు నివాస స్థానం కూడా. ఆ రకంగా నమ్మాళ్వారు అనెడు సముద్రం కూడా శ్రీమన్నారాయణుని యందు వారికి అద్భుతమైన భక్తి భావ బంధము అనే ప్రేమ రసముతో హృదయము నిండిపోయినది. అందు వేదార్థములనెడు రత్నాలకు నిలయమైనది. కనుక అట్టి వారి దివ్యదేహము భగవానునికి వాస మైనది. అని తిరువాయి మొజిలో ( 10-7-8) "తిరుమాళిరుమ్ శోలై మలైయే" ద్వారా తెలుస్తున్నది. మరొక శ్లోకమందు కూరేశులకు భగవత్ రామానుజులయందలి భక్తి భావాన్ని కూడా ఇలా తెలుపుతున్నారు.

**శ్రీ యమునార్య పద పంకజ సక్త చిత్తే**
**శ్రీమత్ పరాన్కుశ గురూత్తమ లబ్ధ విద్యే**
**శ్రీ లక్ష్మణే మునివరే అర్పిత సర్వ భారం**
**శ్రీవత్స చిహ్న గురుమన్వహ మాశ్రయామి**

ఆళ వందార్ల శ్రీపాదముల యందు భక్తి కల మనసు కలిగిన వారును పెరియనంబి గారి సన్నిధిలో మోక్ష ఉపాయము అయిన ద్వయ మంత్రం ఉపదేశింపబడిన వారును అయిన ఎంబెరుమానార్ల సన్నిధిలో తమ రక్షణ భారమును సమర్పించినట్టి వారును అయిన కూరేశులను ఆశ్రయిస్తున్నాను. కూరేశులకు గల నమ్మాళ్వార్ల యందలి, భగవత్ రామానుజాచార్యుల యందలి భక్తిని గురించి తెలుపుతున్నారు. ఈ విధంగా సర్వజ్ఞ భట్టారకులు తెలిపినట్లుగా ఆళ్వార్ దివ్య తిరువడి గళే శరణం అన్న వెంటనే ఎంబెరుమానార్ దివ్య తిరువడి గళే శరణం అనడం శ్రీ వైష్ణవ సాంప్రదాయము. అదే పాటించ తగినది. ఈనాటికి విశిష్టాద్వైత సిద్ధాంతంలో, శ్రీవైష్ణవులైన ప్రతివారు దీనిని పాటిస్తున్నారు. మన పూర్వాచార్యుల ఆచరణే మనందరికీ అనుసరణీయము కదా!

**ఆళ్వార్ దివ్య తిరువడి గళే శరణం!**
**ఎంబెరుమానార్ దివ్య తిరువడి గళే శరణం!!**

# భాగవతంలో భగవంతుని అవతార గాథలు



శ్రీమతి తిరుమల నీరజ

(క్రిందటి సంచిక తరువాయి)

ఆ విధంగా దితి కుమారులు పుట్టిన తరువాత, కశ్యపప్రజాపతి తన పుత్రులను చూడాలని దితి మందిరానికి వచ్చాడు. తాను కావాలని కోరుకొన్న పుత్రునికి 'హిరణ్యకశిపుడు' అని, దితి మొదట కన్న సుతునికి 'హిరణ్యాక్షుడు' అనీ నామకరణం చేసి, ఆశీర్వదించి మళ్లీ తన ఆశ్రమానికి వెళ్లిపోయాడు.

అప్పుడు సాటి లేని తేజఃప్రకాశంతో వెలుగుతున్న హిరణ్యకశిపుడు, తాను బ్రహ్మ వల్ల పొందిన వరాల గర్వం తోను, మహాపరాక్రమం తోను దిక్పాలకు లందరినీ జయించి, తన అధీనంలో ఉంచుకొన్నాడు. ఇక ఏ విధంగానూ మృత్యుభయం లేకుండా నిర్భయంగా ఉన్నాడు.



అతని సోదరుడైన హిరణ్యాక్షుడు తన గదాదండం పట్టుకొని, తనతో సమానంగా తనను ఎదిరించి పోరాడే వైరివీరుని కోసం భూలోకమంతా గాలించాడు. ఎవరూ కనబడకపోతే, చివరికి స్వర్గలోకం మీద దాడి చేశాడు. అక్కడ యుద్ధం అంటేనే ఏ మాత్రం ఇష్టం లేని దేవతలను చూశాడు. యుద్ధకాంక్షతో తమ మీదికి వస్తున్న ఆ రాక్షసుణ్ణి చూసిన దేవతలు, భయంతో కంపించిపోతూ, గరుత్మంతుణ్ణి చూసి అతివేగంగా పారిపోయే నాగుల వలె చెల్లాచెదురై పలాయనం చిత్తగించారు. తాము అంత వరకూ నివసించిన ఇండ్లు, వాకిండ్లూ జిల్లేళ్లు, ఉమ్మెత్తలకు అప్పచెప్పి తోచిన చోటికి వెళ్లి తల దాచుకొన్నారు.

"పిరికిపందలు!" అని వారిని నిందిస్తూ, వికటాట్టహాసం చేస్తూ హిరణ్యాక్షుడు, తన భుజావిజృంభణతో సముద్రం లోనికి ప్రవేశించాడు. అక్కడి వరుణదేవుని బలాలన్నీ ఆ రాక్షసరాజు తేజస్సును తేరిపార చూడలేక పారిపోయి, ఆ సముద్రమధ్యంలో ఎక్కడో దాక్కొన్నారు.

హిరణ్యాక్షుడు నిట్టూరుస్తూ తన దృఢశక్తి చేత గదతో సముద్రంలో కల్లోలం పుట్టకుండా ఆపేశాడు. అక్కడే ఎన్నో ఏండ్లు ఉండి, శత్రుసైన్యాన్ని సంహరించడం ఒక క్రీడ వలె భావించి ఆడుకొన్నాడు. ఆ తర్వాత వరుణుడు పాలించే విభావరీపురానికి వెళ్లాడు. అక్కడ నిండు కొలువులో మహావైభవంతో ఉన్న వరుణున్ని చూశాడు.

సముద్రప్రాణుల రాజుగా పాతాళాన్ని పాలిస్తున్న వరుణున్ని పరిహసిస్తూ ఈ విధంగా అన్నాడు

"నీవు ఎంతో బలం ఉన్నవాణ్ణి అనుకొంటే, ఇప్పుడు యుద్ధంలో నన్ను ఎదిరించు! నీ పరువు ప్రతిష్ఠలను, భుజపరాక్రమాన్నీ నాశనం చేస్తాను" అన్నాడు.

వరుణుడు వాడితో యుద్ధానికి అది తగిన సమయం కాదని, మనసులోని కోపాన్ని సహనంతో అణచుకొని, ఆ దానవేంద్రునితో ఇట్లా అన్నాడు.

"శాంతిని కోరి యుద్ధం వద్దు అనే నియమంతో ఉన్నాను. నీ గొప్ప భుజపరాక్రమ విజృంభణను ఎదుర్కొనే ప్రతివీరుడు ఎవరూ లేరు, ఒక్క ముకుందుడు తప్ప. ఆ మహాత్ముడిప్పుడు వైకుంఠంలో వేంచేసి ఉన్నాడు. యుద్ధరంగంలో పలుమార్లు తన శౌర్యంతో శత్రువులను గెలిచిన మహావీరుడని అందరూ ఆయనను ప్రశంసిస్తూ ఉంటారు. నీవు కనుక వైకుంఠానికి వెళ్లినట్లయితే, నీ కోరిక తీరుతుంది. యుద్ధం చేయలేక పారిపోయే పిరికిపందలా వెంటపడితే నీకేమీ లాభం ఉండదు. అందరికీ తన శరణమిచ్చే గోవిందుడు నీ పని కూడా చక్కపెడతాడు. ఓ బుద్ధిహీనుడా! ఆయన దుష్టశిక్షకుడు, శిష్టరక్షకుడు. కయ్యం సంగతి ఆ దయ్యానికి తెలుసు కాబట్టి, నీవు వెళ్లి ఆ శ్రీహరిని ఎదిరించు. అప్పుడు నీ శౌర్యపరాక్రమాలు ఏ పాటివో తెలుస్తుంది. నీ భుజబలం మొత్తం నాశనమై నేల కూలిపోయి, కుక్కలకు ఆశ్రయ మవుతావు. (మిగతా 17 వ పేజీలో)

## భాగవతంలో భగవంతుని

# అవతార గాథలు

( 16 వ పేజీ తరువాయి )

ఆ తర్వాత ఏం జరుగుతుందో నేనేమీ చెప్పనక్కరే ఉండదు. (దయ్యం అంటే దైవం అనే పదానికి వికృతి రూపం. నీ యుద్ధం సంగతి ఆ దైవానికి తెలుసు అనే సూచన.)

ఆ మాటలు విన్న హిరణ్యాక్షుడు దురాగ్రహంతో మనసులో లేశ మంతైనా భయం లేకుండా "నేనిప్పుడే ఆ అమరమిత్రుడూ, అసురశత్రుడూ ఐన జనార్దనుణ్ని ఎదిరిస్తాను" అంటూ వైకుంఠం వైపు బయలుదేరాడు.

ఆ ప్రకారం వెళుతున్న హిరణ్యాక్షునికి, నారదమునీంద్రుడు ఎదురయ్యాడు. "ఎక్కడికి పోతున్నావు రాక్షసరాజా?" అని ప్రశ్నించాడు.

"నాభిలో పద్మం ఉన్న ఆ ఇందిరానాథుణ్ని, ఆ అంతం లేని వాణ్ని అంతం చేసి మా అసురకులం వారందరికీ ఆనందం కలిగించాలనే పట్టుదలతో వైకుంఠపురం వైపు వెళుతున్నాను" అన్నాడు హిరణ్యాక్షుడు.


"ఓ అలాగా? ఐతే అద్భుత పరాక్రమశాలి ఐన ఆ మహాత్ముడు, నేడు వైకుంఠంలో లేడు. భూభారాన్ని భరించటం కోసం, ఆదివరాహ అవతారం ధరించి రసాతలంలో స్థిరంగా నిలచి ఉన్నాడు. అక్కడికి వెళ్లగలిగితే వెళ్లు! మీ రాక్షసకులాన్ని అంతం చేయటానికే అవతారం ఎత్తిన ఆ శ్రీమహావిష్ణువుతో నీకు తప్పకుండా యుద్ధం జరుగుతుంది" అన్నాడు దేవర్షి నారదుడు.

ఆ మాటలు విన్న దానవరాజు అగ్నిహోత్రుని వలె మండిపడ్డాడు. ఆ శ్రీహరిని ఎదిరించాలనే కోరిక పెరిగిపోగా, మహాపరాక్రమంతో గొప్పదైన తన గదాదండాన్ని చేతబట్టి, మూడు లోకాలకూ భయం కలిగించే రూపంతో క్షణంలో పాతాళానికి వెళ్లాడు. అక్కడ నీటిమధ్యలో ఎట్టయెదుట వరాహరూపుడై ఉన్న మహావిష్ణువును చూశాడు. ఆ ఆదివరాహం భయంకరమైన కోరలతో, భూమండలాన్ని భరించేందుకు సిద్ధమై ఉంది.

అప్పుడు వరాహరూపధారి శ్రీహరి, తన పద్మదళాయతనేత్రాల కాంతిని చుట్టుపక్కలకు వ్యాపింపచేస్తూ, కేవలం తన దృక్కుల తోనే ఆ హిరణ్యాక్షుని శరీరకాంతిని క్షణంలో హరించాడు. అంటే తగ్గిపోయే విధంగా చేశాడు.

(సశేషం) ★

# శ్రీమద్రామానుజులు బోధించిన సంక్షిప్త విశిష్టాద్వైత సిద్ధాంత సారము



శ్రీమాన్ శ్రీ మరింగంటి అనంతాచార్యులు
కరీంనగర్

శ్రీమద్రామానుజ ముని
చివరి కాలమున శిష్యుల
ముందుంచిన శ్రీసూక్తులు
మోక్షమునకు జేర్చు మెట్లు

అర్చించే దేవుని - శిల
అనుకొన్నను నరకమె గతి
నరునిగ గురువును జూచిన
నరులకు నరకమ్మే గతి

వైష్ణవ పుంగవుల జూచి
వైష్ణవ జాతిగ తలచిన
వారి పాద తీర్థంబును
వట్టి నీరనగ నరకమె

మంత్రము విని మహిమాన్విత
మంత్రమనుచు మదినెంచక
శబ్ద సామ్యమనుకొన్నను
శాశ్వతముగ నరకమె గతి

శ్రీమన్నారాయణులను
సర్వేశ్వరుడని నమ్మక
ఇతరులతో పోల్చువారి
కిహపరముల నరకమె గతి

భగవంతుని పూజకన్న
భాగవతార్చన శ్రేష్ఠము
విష్ణు దూషణము కన్నను
వైష్ణవ దూషణ పాపము

హరిపాద జలంబు కన్న
హరిదాసులు పాద జలము
శ్రేయోదాయకము, కాన
చేయండి తదీయ సేవ

శ్రీ భాష్యము ద్రావిడాగమ
సేవనమ్ముజేసి వాని
ప్రవచించుడు, తెలియగోరు
పరమాత్ముని బంధువులకు

శ్రీశుని కైంకర్య మందు
చేరిపొందు ప్రతిదినమ్ము
గోవిందుని నామ సుధను
గ్రోలుచు కాలము గడుపుడు

తిరునారాయణ పురమున
తిరముగ వాసము చేయుడు
అర్థముతో కూడి "ద్వయము"
అనుక్షణము ధ్యానింపుడు

భాగవతోత్తముల యందు
భారముంచి మసలు కొనుడు
ఇంగితజ్ఞులై వీనిని
ఎప్పుడనుసరించి మనుడు


అనుచు శిష్యబృందమునకు
ఆనతిచ్చి యతిరాజులు
పరమ ముదమ్మావహింప
పరమపదము చేరుకొనిరి

మనముజ్జీవించుటకై
మన యతిరాజులు చెప్పిన
విషయమ్ముల ననుసరించి
విష్ణు పదము చేరుదాము.

శ్రీ రామానుజయతిభ్యో నమః

★

# శ్రీరామానుజ అవయవ విభూతి



**శ్రీమతి కొడకళ్ళ పద్మజ జ్యోతిర్మయి, చెన్నై.**

(గత సంచిక తరువాయి)

**"మస్తకం శ్రీశఠారాతిం, నాథాఖ్యం ముఖ మండలమ్**
**నేత్ర యుగ్మం సరోజాక్షం కపోలం రాఘవం తథా!!"**

మస్తకం శ్రీశఠారాతిం అంటూ భగవద్రామానుజుల శిరోభాగంలో శ్రీనమ్మాళ్వార్లు వేంచేసి ఉంటారు అంటూ ప్రారంభించేశారు. భగవంతుని శ్రీపాదాలకు శ్రీశఠారి అని తిరునామం. నమ్మాళ్వార్లు భగవంతునికి శ్రీపాద స్థానీయులు కనుక. మరి నమ్మాళ్వార్ల శ్రీపాదాలను, మధురకవులంటారు. అదే నమ్మాళ్వార్ల శ్రీపాదాలను, వారి అవతార స్థలమైన ఆళ్వార్ తిరునగరికి వేంచేస్తే "శ్రీరామానుజర్" అనుగ్రహించవలసింది అని ప్రార్థించాలిట. "శీర్ ఆరుమ్ వేదమ్ తమిష్ శెయ్ ద మెయ్యన్ ఎషిల్ కురుకై నాదన్ అవదరిత్త నాళ్". సంస్కృత వేదాన్ని ద్రావిడభాషలో అనువదించి, లోకంలో కృష్ణ భక్తిని ప్రవేశపెట్టడానికి అవతరించిన వారు శ్రీనమ్మాళ్వార్లు. ఆదిత్యుడు, రామదివాకరుడు, అచ్యుతభానుడు ఉదయించినా పోని చీకటి అనే అంధకార అజ్ఞానాన్ని నశింపచేయడానికి అవతరించారా! అన్నట్టుగా అవతరించారుట! వకుళాభరణభాస్కరులు. నమ్మాళ్వార్లు వేరు కృష్ణ భక్తి వేరు కాదు కదా! అందుకే "ఋషిం జుషా మహే కృష్ణ తృష్ణా తత్వమివోదితం! అని, యః శ్రుతేః ఉత్తరం భాగం చక్రే ద్రావిడభాషయా" అని అన్నారు కదా. అలా శ్రీనమ్మాళ్వారు భగవద్రామానుజుల శిరస్సులో తిరుముడి స్థానంలో వేంచేసి ఉంటారట!.

"తిరునెడున్దాణ్డకమ్" లో శ్రీతిరుమంగైమన్నన్ వర్ణిస్తారు పెరుమాళ్ళ కేశపాశాలను "మైవణ్ణ నరుంగుంజి కుషల్ పిన్ తాష" అంటూ కాటుక వర్ణం కలిగి పరిమళిస్తున్న కేశపాశములట. పోతన గారు కూడా వర్ణిస్తారు కదా ఆ గజేంద్రుని ఆర్తనాదాలకు "ఆకర్ణికాంతర ధమ్మిల్లముంజక్కనొత్తడు" అంటూ. "మకరమ్ శేర్ కుప్తై యిరుపాడు" ఆ మకరకుండలములను ధరించి ఉన్న, రెండు కర్ణికాంతరాల మీద పడిపోతున్న కేశపాశాన్ని సర్దుకోకుండా పరుగెత్తాడు అని. ఆ పోతనగారే "అల వైకుంఠపురం" అన్నారు. అక్కడెక్కడో శ్రీవైకుంఠం. అక్కడ ఉన్న ఆయన సౌందర్యం సేవించడం కాస్త దుర్లభం ఆ "అల" ని కాస్త "ఇల" కు చేర్చినవారు భగవద్రామానుజులవారు. ఇలలో అంటే ఈ లోకంలో నమ్మాళ్వార్ల దివ్య ప్రబంధ తాత్పర్యమైన శరణాగతి ధర్మాన్ని లోకంలో వర్ధిల్లేటట్టుగా, మరియు పుణ్యమనే తామరపుష్పాన్ని వికసింపచేసి పాపమనే చీకటి అనే అజ్ఞానాన్ని పారద్రోలడానికి "లక్ష్మణో లక్ష్మి సంపన్నః" అన్నట్టు ఇళైయాళ్వారై అవతరించేరట, శ్రీమన్నారాయణుడు, లక్ష్మీసమేతుడై కేశవ నామంతో నిత్యవాసం చేస్తున్న విలక్షణమైన శ్రీపెరుంబూదూరులో "అరమికు నల్ పెరుమ్బూదూర్ అవతరిత్తాన్ వాషియే" ఆదిశేషాంశ సంభూతులు. వీరి శిఖానివేశం మరింత కమనీయం కదా! అలాంటి అందమైన శిఖని సేవిస్తే ఆ స్థానంలో ఆళ్వార్లు వేంచేసి ఉంటారు కనుక, ఆళ్వార్ల యొక్క కృష్ణ తృష్ణ మనకీ అనుభవం అవుతుందిట.

నాథాఖ్యం ముఖమండలం: జ్ఞాన వైరాగ్య రాశి అయిన శ్రీమన్నాథమునులు వేంచేసి ఉంటారుట భగవద్రామానుజల తిరుముఖ మండలంలో. "నాథయామున మధ్యమాం" అన్నట్టు నాథమునుల సన్నిధికీ, వారి మనుమలు అయిన యామునమునుల సన్నిధికీ మధ్యలో వేంచేసి ఉండే సన్నిధిలో "మన్ననార్" అన్న తిరునామంతో భగవంతుడు వేంచేసి ఉన్న వీరనారాయణపురంలో అవతరించారు 823వ సం.లో. ఈనాటికి 20 షష్ట్యబ్దులు పూర్తి చేసుకొన్న మహానుభావులు శ్రీమన్నాథమునులు. ఆళ్వార్ల దివ్య ప్రబంధం మీద మిక్కిలి ప్రీతికలవారయిన మధురకవుల కళ్యాణ గుణాల యందు ఆసక్తి కలవారు శ్రీమన్నాథమునులు అంటారు. శ్రీతిరువరంగత్త అముదునార్. ఆ ఆసక్తి వలనే "అవిదిత విషయాన్తర శ్శఠారేః", " వేరొన్నుమ్ నానరియేన్" అన్న మధురకవుల తనియన్లను వీరే అనుగ్రహించారు. శ్రీమన్నాథమునులు ఆచార్య ప్రథములు. ఈ స్తోత్రాన్ని మనకు అనుగ్రహించిన శ్రీవానమామలై జీయర్ స్వామి వారే తిరుప్పావై ప్రబంధానికి వ్యాఖ్యానాన్ని అనుగ్రహిస్తూ, 14వ పాశురంలో "నావుడైయాయ్" అంటారు. మధురమైన నాలుక కలవారు నాథమునులు అని. ఇంతకీ ఏమిటి ఆ మాధుర్యం అంటే దివ్య ప్రబంధం అన్నది ఇంపైన కవిత్వం అయి పరమ కవుల చేత అనుగ్రహించబడినది అవడం వలన, మృదువైన వాక్కులు అనే పుష్పాలతో కూర్చిన దివ్యమైన మాలలు అయినందున, అంత గొప్ప దివ్య ప్రబంధాన్ని దివ్యమైన గానంతో చేర్చి పాడాలి అన్న మన్ననార్ ఆజ్ఞ మీద ఆ పాశురాలన్నింటికీ రాగాలను గూర్చి, వారి మేనల్లుళ్ళు అయిన కీప్తై యకత్తాళ్వాన్, మేలైయకత్తాళ్వాన్ చేత పాడించి రాగయుక్తమైన ప్రబంధాన్ని మనకు అందించిన వారు శ్రీమన్నాథమునులు. సంగీత మరియు యోగశాస్త్రముల యందు

# అవయవ విభూతి

మిక్కిలి ప్రావీణ్యం కలవారు. అలా శ్రీమన్నాథమునులు రామానుజుల వారి తిరుముఖ మండలంలో తిరుమణిక్కాప్పు ధరించే స్థానంలో వేంచేసి ఉంటారుట. ఎలా ఉన్నదిట వారి తిరుముఖ మండలం అంటే వర్ణిస్తున్నారు మామునులు భగవత్సాక్షాత్కారంతోనూ, మరియు ఆశ్రితులను చూడడం వలన కలిగిన సంతోషంతో ఉన్నదిట. అనాశ్రితులకు ఏదో ఉపదేశం చేస్తున్నట్టుగా ఉన్నదిట ఆ "తిరువాయ్". మరియు ఆశ్రితరక్షణ వలన కలిగిన ఆనందం చేత ప్రకాశించే చిన్న చిరునవ్వు కూడా అమరి ఉన్నదిట ఆ అధరాల మీద. కారుణ్యామృతాన్ని కటాక్షించే రెండు నేత్రములట. "ఈరారు తిరునామ మణిన్ద వెళిల్ వాళి" ఎర్రటి తిరుమేనిలో తెల్లటి ఊర్ధ్వపుండ్రం "తిరువరంగం పెరియకోయిల్" కి అధీశుడైన శ్రీరంగనాథుడి శ్రీపాదలే ఈ తిరుముఖమండలాన్ని అలంకరించాయా! అన్నట్టు ఉన్నదిట. "శిరీతరన్ తొల్ పుకళ్ పాడి కుమ్బిడు నట్టమిట్టాడి" శ్రీధరుని స్వాభావిక కీర్తిని పాడి, ఆడి, దండమిడి అని అన్న ఆళ్వార్ల శ్రీ సూక్తిని అనుసరించి, శ్రీమన్నాథమునులు ఆ భక్తితో ఆగక దాన్ని అనుభవంతో రాగయుక్తంగా మలచి ఎలా అయితే పాడించారో, అలాంటి నాథమునుల భక్తి భావన మనకీ అనుభవం అవుతుంది. నేత్రయుగ్మం సరోజాక్షం:

**"శరీరం వసు విజ్ఞానం వాసన్ కర్మ గుణానసూన్**
**గుర్వర్థం ధారయేద్యస్తు స శిష్యో నేతరస్మృతః"**

అంటే తమ సర్వస్వం తమ ఆచార్యులకే ధారపోసే స్వభావం కలిగిన వారు, నాథమునుల శిష్య బృందంలో ప్రధానమైన వారు, తిరుక్కురుగైక్కావలప్పన్ మరియు ఉయ్యక్కొండార్ అనబడే శ్రీపుండరీకాక్షులు. "ఏక స్వాదు న భుంజీత" అన్నట్టు మధురమైన భగవత్ గుణానుభవాన్ని అందరితోనూ కలిసి పంచుకోవాలని తిరుక్కురుగైక్కావలప్పన్‌కు తమ అష్టాంగ యోగ రహస్యాలను, పుండరీకాక్షులకు దివ్య ప్రబంధాన్ని అనుగ్రహించారు. ఈ మహానుభావులు వేంచేసి ఉంటారట భగవద్రామానుజుల వారి నేత్రాలలో. "తూమురువల్ వాళి!! తుణై మలర్కణ్గళ్ వాళి" అన్నట్టు, ఆ శ్రీరంగాలయలక్ష్మిని సేవిస్తూ ఉండడం వలనా, తాము సంస్కరించగా సంస్కరింపబడిన శ్రీవైష్ణవ సంపదను ఎల్లప్పుడూ చూసి ఆనందించేవిగా ఉన్నాయట ఆ నేత్రాలు! కారుణ్యమనే అమృతధారని ప్రసరించేవి అయి ఉన్నాయట ఆ నేత్రాలు "అమలంగళాక విషిక్కుమ్" ఆశ్రితులు పరిశుద్ధులయ్యేట్టు కటాక్షించేవి అయి ఉన్నాయట ఆ నేత్రాలు. ఒకసారి శ్రీరంగనాథుడు తాయార్ తిరుక్కోలం అంటే తాయారుల వేషం వేసుకొని వచ్చి శ్రీపరాశరభట్టరు వారితో "ఏమండీ! నేను మీ అమ్మవారు పెరియపిరాట్టి వలె ఉన్నానా" అని అడిగారట. అ, అవును, అంత సౌందర్యంతోనూ వేంచేసి ఉన్నావయ్యా! కానీ ఆవిడ నేత్రాలలో కనపడే ఆర్ద్రం నీ నేత్రాల యందు నాకు కనపడడం లేదయ్యా అంటారుట భట్టరువారు. మరి "దరదళిత అరవిందోదంత కాంతాయతాక్షి" కదా ఆవిడ. అలా ఉన్నాయిట రామానుజులవారి నేత్రాలు అమ్మలా లాలించేట్టుగా. ఆర్ద్రతతో, కారుణ్యంతో, దయతో విలసిల్లుతూ ఇక్కడ శ్రీపుండరీకాక్షులు వేంచేసి ఉంటారు కాబట్టి సంస్కృత వేదానికి సమమైన ద్రావిడవేద విద్య లభిస్తుందిట రామానుజుల వారి నేత్రములను సేవిస్తే.

కపోలం రాఘవం తథా: శ్రీమన్నాథమునులు తిరునాడు అంటే పరమపదాన్ని అలంకరించిన తర్వాత వారి ప్రధాన శిష్యులు శ్రీపుండరీకాక్షులు దర్శనాన్ని నిర్వహిస్తున్న రోజుల్లో ఒక 5గురు శిష్యులు వారి శ్రీపాదాలను ఆశ్రయించారుట. అందులో మణక్కాళ్నంబి అనబడే శ్రీరామమిశ్రులు 12 సంవత్సరాలు పాటు "అహం సర్వం కరిష్యామి" అన్న లక్ష్మణస్వామి వలె సర్వవిధ కైంకర్యములు చేసుకున్నారుట, శ్రీపుండరీకాక్షులకు. ఒకనాడు వారి తిరుకుమార్తెలు నదికి వెళ్లి స్నానం చేసి వచ్చే సమయంలో ఆ ప్రాంతం అంత బురదగా ఉండడం వలన ఆగిపోయి సందేహంగా నిలుచొని ఉన్నారుట. అప్పుడు శ్రీరామమిశ్రులు "పడియాయ్ కిడన్దు ఉన్ పవళవాయ్ కాణ్బేనే" నీ సన్నిధిలో ఒక గడపగా పడి ఉండి నీ ఎర్రటి పగడపు అధరాలను ఎప్పుడు సేవిస్తానో అని ఆశపడ్డ కులశేఖర పెరుమాళ్ వలె, వీరూ ఒక గట్టుగా పడి ఉండి తమ వీపు మీద కాలు పెట్టి ఆ బురదను దాటేట్టు చేసి తమతో పాటు తీసుకొని వచ్చేరుట వారిని. దానికి శ్రీపుండరీకాక్షులు ఎంతో సంతోషించి, శ్రీరామమిశ్రుల యొక్క శిరస్సు మీద వారి శ్రీపాదకమలాలను అలంకరించారుట. "మానసం వాచికం పాపం కాయికంచ త్రిధా కృతమ్ ద్వయ స్మరణ మాత్రేన నాశయంతి సునిశ్చితమ్" అన్నట్టు మనసుతోనూ, వాక్కుతోనూ, శరీరంతోనూ చేసిన మూడు రకముల్లైన పాపములు ద్వయమంత్ర అనుసంధానంతో పోతాయి ఇది నిశ్చయమైనది. అన్నట్టు ద్వయమంత్ర కాలక్షేపాన్ని మరొకమారు అనుగ్రహించారుట. అలా శ్రీరామమిశ్రులు భగవద్రామానుజుల వారి కపోల భాగంలో వేంచేసి ఉంటారుట. ఆ కపోల భాగం సేవిస్తే వారివంటి ఆచార్య నిష్ఠ మనలోనూ కలుగుతుంది. శ్రీకూరత్తాళ్వాన్ అంటారు "ఆయతాక్ష అభిజాత కపోలం" అని ఆ ఇంట్లో, ఈ ఇంట్లో ఉన్న వెన్న, పెరుగు తినడం వలన శ్రేష్ఠమైన కపోలములుగల కణ్ణన్‌ని అనుభవించే భగవత్ రామానుజులవారి వారి కపోలాలు ఇంకెంత శ్రేష్ఠంగా ఉంటాయో కదా!!!

**శేషోవా సైన్యనాథోవా శ్రీపతిర్వా**
**శ్రీ భాష్యకార నిత్య శ్రీః నిత్య మంగళమ్**

# శ్రీవైష్ణవ సాంప్రదాయం

## సమాశ్రయణములు



– శ్రీమత్ తిరుమల పల్లెర్లమూడి వేంకట వీర రాఘవాచార్యులు

అన్ని జన్మములలో మానవ జన్మ చాలా విశిష్టమైనది. ఎన్నో జన్మల పుణ్య ఫలమే ఈ విశిష్టమైన మానవ జన్మ. అయిననూ గత జన్మల్లోని కొన్ని పాపాల వలననూ, కొన్ని తీరని కోర్కెలు కలిగి ఉండటం వలననూ, కొన్ని ఋణానుబంధాల వలననూ ఈ మానవ జన్మలో కొన్ని మానసిక, శారీరక, అనారోగ్య సమస్యలను పొందుతూ వాటిలోనే కొట్టుమిట్టాడుతూ సర్వ జీవకోటికి తల్లిదండ్రులైన లక్ష్మీనారాయణుల పాదాలను ఆశ్రయించి ఏవిధముగా వారి కృపకు పాత్రులవ్వాలో గ్రహించలేకున్నాము. మానవుడు గతజన్మలలో చేసిన దుష్కర్మల ప్రభావాన్ని భస్మముచేసి, ఈ జన్మలో వాటి ప్రభావాన్ని తగ్గించుకోవాలంటే ఈ మానవ జన్మలో విజ్ఞతతో జ్ఞానాన్ని సంపాదించి ఒక అర్హతను సంపాంచుకోవాలి. ఆ అర్హత భవిష్యత్ జన్మలను కూడా పరిరక్షణ చేసేవిధంగా ఉండాలి. అంటే మన ఆత్మను పరిశుద్ధం చేసుకొని భగవత్ స్వరూపమైన సర్వ జీవకోటికి సేవచేయటం ద్వారా భగవంతునికి సేవచేయాలి. విశిష్టాద్వైత శ్రీవైష్ణవ సంప్రదాయంలో పంచకర్మ ప్రక్రియలు (సమాశ్రయణము) ఆ అర్హతని కలిగిస్తాయి. శ్రీవైష్ణవం అనేది శ్రీమహావిష్ణు సంబంధం. శ్రీ అనగా లక్ష్మీ. వైష్ణవం అనగా విష్ణుమూర్తి సంబంధం. శ్రీవైష్ణవం అంటే శ్రీలక్ష్మీతో కూడిన విష్ణుమూర్తిని ఆరాధించటం. శ్రీ లక్ష్మీ మోక్షానికి మాధ్యమం. బిడ్డల యందు దయ గల ఆ తల్లి, ఆ బిడ్డల ఆలనా పాలనా విషయంలో తండ్రి ఐన విష్ణువుకు తెలియజేస్తుంది. తద్వారా జీవులకు విముక్తి మరియు మోక్షం కోసం, వారి కోరికలు తీర్చడంలో సహాయం చేస్తుంది.



సమాశ్రయణం అంటే ఏమిటి? ఇది ఒక శ్రీవైష్ణవ సంప్రదాయ మతకర్మ (సంస్కారం). సంస్కారమనగా శుద్ధి క్రియ. సంప్రదాయమున ఒక దీక్ష. సమాశ్రయణమవటం అంటే శ్రీమహావిష్ణు భగవానునితో సంబంధం ఏర్పరచుకోవడమన్న మాట! ఏదైనా వస్తువు “ఇది నాది” అని గుర్తించటానికి దానిపై పేరును వ్రాయటమో. ఏదైనా గుర్తును వ్రాయటమో చేస్తాము కదా. అలాగే ఈ జీవాత్మ పరమాత్మునికి స్వంతం అని గ్రహించటానికే ఈ సంస్కారం. పూర్వాచార్యులను అనుసరించి. శ్రీవైష్ణవుడవ్వాలంటే ఒక విధానం ఉన్నది. అదే అనర్హతా యోగ్యుడ్ని అర్హతాయోగ్యునిగా చేయు ఒకవిధానం. సమాశ్రయణమంటే సదాచార్యులను ఆశ్రయించి వారు ప్రసాదించే పంచ (5) సంస్కారములతో ఆత్మ శుద్ధిని పొంది భగవత్సేవకు యోగ్యులుగా సంస్కరింపబడే ప్రక్రియ. ఈ ప్రక్రియను చక్రాంకితములు చేయించుకోవటం, చక్రాంతములు అవటం, మంత్రోపదేశం పొందటం అని కూడా కొందరు లౌకికంగా అంటారు. శాస్త్రాలమీద మరియు పరంపరానుగత ఆచార్యుల మీద నమ్మకంతో సమతామూర్తి జగదాచార్య భగవద్రామానుజా చార్యుల వారు వెలుగులోనికి తీసుకునివచ్చినది ఈసంస్కారం. భగవద్రామానుజాచార్యుల వారికి సింహమాస (అవని) శుద్ధ పంచమి శుభ దినమునాడు మధురాంతక క్షేత్రంలో శ్రీవైష్ణవ సాంప్రదాయంలో విశిష్ట ఆచార్యులైన శ్రీ పెరియ నంబిగారు సమాశ్రయణము అనుగ్రహించారు.

సమాశ్రయణము ఎందుకు చేయించుకుంటారు? శ్రీవైష్ణవుడగుటకు ఇది ప్రథమ సోపానం. ఆచార్యుని ద్వారా మంత్రోపదేశం పొందు ప్రక్రియలో భాగంగా పొందిన అర్ధ పంచక జ్ఞానం వలన నిత్య విభూతి యందు శ్రియః పతికి కైంకర్యం చేయుట అను లక్ష్యమును సాధించుటకు అర్హులమవుతాము. జీవాత్మకు ఈ పంచ సంస్కారములు

అవడం నిజమైన జన్మ లభించడం వంటిది. దీని వల్ల జీవాత్మ తన స్వరూపమును గుర్తించి భగవదాధీనుడవుతాడు. భగవానునికి అన్నివిధాలా లొంగి ఉండడమే నిజమైన జ్ఞానం. ఈ విశిష్ట సంబంధము భార్య (జీవాత్మ) భర్తలకున్న (పరమాత్మ) పవిత్ర బంధము వంటిది. బ్రహ్మజ్ఞానం పొందుట వలన మోక్షము లభించును. **శాస్త్రం అంటే** ? మనల్ని నిర్ధేశించు/ మార్గనిర్దేశనం చేయు ప్రామాణిక గ్రంథములు అవి వేదం, వేదాంతం, పాంచారాత్రాగమం, ఇతిహాసములు (శ్రీరామాయణ భారతాదులు), పురాణములు (విష్ణు, భాగవత, గరుడ మొదలైనవి), ఆళ్వారుల దివ్య ప్రబంధములు, పూర్వాచార్యుల కృతులు, స్తోత్రములు (స్తోత్రరత్నాలు) వ్యాఖ్యానములు.

**పంచసంస్కారములు అనగా** ? 'తాపః పుండ్రః తథా నామః మంత్రో యాగశ్చ పంచమః'. ఆత్మ ఉన్నతి కోసం ఐదు ముఖ్యమైన వేద నిర్దేశిత సాంకేతిక శుద్ధీకరణ ప్రక్రియల ద్వారా ఒక వ్యక్తిని భగవానుని కైంకర్యము నందు (ఈ సంసారము నందు మరియు పరమపదము నందు నిమగ్న పరచు ప్రక్రియలు. 1. **తాప:** శంఖచక్ర లాంఛనములు శ్రీమన్నారాయణునకు మాత్రమే ఉభయ హస్తములందుండు శంఖచక్ర ముద్రలను తాపం (వేడి) గావించబడి మన భుజముల యందు ధరింప చేయుట. దీని వలన మనం ఇకపై భగవంతుని సొత్తుగా పరిగణింపబడతాము. ఎలాగైతే ఒక పాత్రపై యజమాని చిహ్నముచే ముద్రించిన అది వానికి ఎలా చెందునో మనం కూడ ఈ శంఖచక్ర ముద్రల స్థాపనం వల్ల భగవానునకే చెందిన వారమవుతాము. **2. పుండ్రం** (బొట్టు, స్వరూపం): ద్వాదశ ఊర్ధ్వపుండ్ర ధారణం శరీరమున (పురుషులు) పన్నెండుస్థలములలో ఊర్ధ్వపుండ్ర (తిరుమణి మరియు శ్రీ చూర్ణం) ధారణం చేయుట. **3. నామ:** దాస్య నామం పొందుట. ఒక నూతన పేరు ఆచార్యునిచే పొందుట. (రామానుజ దాస, మధురకవి దాస, శ్రీ వైష్ణవదాస,స్త్రీలకు 'దాసి' ఇత్యాదులు). **4.మంత్రం:** మంత్రోపదేశం పొందుట. రహస్య మంత్రములను ఆచార్యుని ద్వారా పొందుట. ఇది మననం చేయువారిని దుఃఖముల నుండి రక్షించును. తిరుమంత్రం (నారాయణ అష్టాక్షరీ మహామంత్రం), ద్వయమంత్రం మరియు చరమ శ్లోకములనెడి ఈ మంత్రములు సంసార విముక్తిని కలిగించును. **5. యాగ:** అనగా దేవపూజ. గృహమున భగవానుని ఆరాధించు విధానమును నేర్చుకొనుట.

ఈ ప్రక్రియలకు ఎంత సమయం పడుతుంది? సుమారు రెండు లేదా మూడు గంటలు పడుతుంది. ఆ తరువాత ప్రసాదం తీసుకోవచ్చును. అప్పటివరకు సమాశ్రయణం కావాలనుకున్న వారు ఏమియూ తినకూడదు, త్రాగకూడదు. అందుకే సాధారణముగా ఇది ఉదయాన్నే చేస్తారు. సమాశ్రయణం చేయించుకొనుటకు ఎవరు అర్హులు? శ్రీవైష్ణవుడు కావడానికి బ్రాహ్మణుడు కానవసరం లేదు. జాతి,మత,కుల,లింగ, వివక్షత లేదు. ఉన్నవాడు, లేనివాడు అనే భేదము లేకుండా అందరికీ చెందినదే శ్రీవైష్ణవం. భగవంతుని కృపను పొందుటకు సర్వమానవ సమానత్వం, ఎవరైనా సరే, ఎవరికి మోక్షంపై అభిలాష ఉందో వారందరు అనుసరించ వచ్చు. ఈ పంచ సంస్కార విశిష్టాద్వైత విధాన ప్రక్రియకు ప్రస్తుత జీవిత విధానము నుండి ఉన్నతి పొంది పరిశుద్ధులగుటకు ఇష్టపడు వారందరూ అర్హులే! ఇది ఆత్మకు సంబంధించిన ఒక వైష్ణవత్వ విధానం. సమాశ్రయణం ఎవరు అనుగ్రహిస్తారు. భగవద్రామానుజులవారు సిద్ధాంతపరచిన విధముగా వంశపారపర్యంగా వస్తున్న ఆచార్య పురుషులు, మఠములలోని జీయర్లు (శ్రీవైష్ణవ సన్యాసులు) పంచ సంస్కారములు అనుగ్రహిస్తారు. ఆచార్యులు అనగా ఎవరు? మన సంప్రదాయములో మంత్రోపదేశం చేసిన వారిని ఉత్తారకాచార్యులనీ, మంత్రార్థాది శాస్త్ర విషయాలను అనుగ్రహించిన వారిని ఉపకారకాచార్యులనీ అంటారు. వీరిలో ఎక్కువ, తక్కువలు లేవు. ఇరువురు సమతుల్యులే! గౌరవపాత్రులే! క్రొత్త విషయాలు, మంచి మాటలు నేర్పించేవారెవరైనా గురువులే! కాని గురువులందరూ ఆచార్యులు కాదు. శాస్త్రాలను సంపూర్ణముగా తాము అభ్యసించి, అనుష్ఠిస్తూ, తమ అనుష్ఠానము ద్వారా, శ్రీసూక్తుల ద్వారా తమను ఆశ్రయించు వారికి నేర్పించే వారు సదాచార్యులు. సదాచార్య సమాశ్రయణము భగవదనుగ్రహము వలననే సిద్ధిస్తుంది. అనగా అట్టి భగవదనుగ్రహము తాము కల్గి యుండి, మనను అనుగ్రహించువారే సదాచార్యులు.ఆచార్యులంటే ఒక వ్యక్తి కాదు. ఒక పరంపర వ్యవస్థ. ఆచార్య పరంపరలో పరమాత్మ శిఖరస్థానీయుడు. మన ఆచార్యులలో పరమాత్మను, పరమాత్మలో మన ఆచార్యులను దర్శించగలిగే పరిణతి కలిగి యుండాలి.

సమాశ్రయణము చేయించుకొనుటకు ముందస్తు షరతులు ఏమిటి? ( మిగతా వచ్చే సంచికలో )



# వాడ వాడలా గణనాథుని మండపాలు









వాడ వాడలా గణనాథుని మండపాలు వెలసి శ్రావణ మాసపు తుది రోజుల్లో వీధి కూడళ్ళు దేవాలయ శోభలను సంతరించుకుంటాయి. పురాణ కథానుసారంగా వినాయక చతుర్థి అని భాద్రపద శుద్ధ చవితి రోజున గణనాథుని జయంతి జరుపుకుంటారు. శివపార్వతుల సుపుత్రునిగా లోక కళ్యాణార్థం అవతరించిన గజాననుడు సంకటములు హరించే, విఘ్నములు తొలగించే దేవతగా పూజింపబడుతున్నాడు. శుభకార్యాలలో ప్రథమ పూజను అందుకునే ప్రమథ గణ నాయకునిగా కొందరు విశ్వసిస్తారు. భాద్రపద శుద్ధ చవితి నుండి గణపతి నవరాత్రులుగా వినాయకుణ్ణి (మట్టి రూపంలో) మండపాల్లో ప్రతిష్ఠించి, ఆరాధించి నిమజ్జనోత్సవంతో ఉత్సవాలు ముగిస్తారు.

ఈరోజే శ్రీ వైష్ణవ సంప్రదాయంలో కూడా లౌకిక ఆచారంగా విశ్వక్సేన జయంతిని కూడా జరుపుకుంటారు. వైఖానసాగమమును, భగవచ్ఛాస్త్రమైన పాంచరాత్రాగమమును అనుసరించి భగవంతుడైన శ్రీమన్నారాయణుని సేవించే నిత్య సూరులలో ఒకరుగా, శ్రీమహావిష్ణువు సేనా నాయకునిగా విశ్వక్సేనభగవానుని ఆరాధిస్తారు. అంతేగాక ఎన్నో రకాల పదార్థాలతో కర్రతో దంతాలతో వినాయక మూర్తిని తయారు చేస్తుంటారు. శుభకార్యాలలో పసుపుతో వినాయకుని చేయటం శాస్త్రోక్తము. పురాణ కథావృత్తాంతము అనుసరించి పసుపు వినాయకుని పూజిస్తే విఘ్న దోషాలు హరిస్తాయని ప్రశస్తి. నవరాత్రులు పూజించిన వినాయక మూర్తిని జల నిమజ్జనం చేసే క్రమంలో నీటిలో కరిగే పదార్థములతో వాతావరణ కాలుష్యమునకు తావు లేకుండా వినాయక మూర్తిని తయారు చేయాలి. రసాయన పదార్థాలతో చేసిన మూర్తిని జల నిమజ్జనం చేయుట వలన పరిసర, వాతావరణం లో కాలుష్యం ఏర్పడుతుంది కనుక మట్టి గణపతి మూర్తినే ప్రతిష్ఠించి ఆరాధించి నిమజ్జనం చేయాలని ప్రభుత్వం కూడా ప్రచారం చేస్తున్నది.

భారతీయ సంస్కృతి సంప్రదాయాలు అడుగంటుతున్నాయని అలజడి చెందుతున్న నేపథ్యంలో దేశమంతా జరుపుకునే వినాయక చవితి పండుగ భగవద్విశ్వాసానికి సత్సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తున్నది. ★

# పుస్తక పరిచయం

## రత్నత్రయీ

"జాతౌజాతౌ యదుత్కృష్టమ్ తద్రత్నమితి కథ్యతే" జాతి కెల్ల మిన్నయై చను దానిని రత్నమందురు అని పెద్దలు నిర్వచిస్తారు. ఆ విధంగా స్తోత్రములలో రత్నము ఆళవందారు స్తోత్రమని, పురాణములలో రత్నము శ్రీ విష్ణు పురాణమని, మంత్ర రత్నము ద్వయ మంత్రమని పెద్దలు నిర్ణయించారు. మూడు రత్న విశేషములను తెలిపే గ్రంథం "రత్నత్రయీ" మనస్విని ప్రచురణల ద్వారా ముద్రితమైనది. ఈ గ్రంథ ప్రచురణకర్తలు శ్రీమాన్ శ్రీ డా. కోయిల్ కందాడై వెంకట సుందరాచార్యులు. 620 కి పైగా పేజీలతో ఆకర్షణీయమైన ముఖ చిత్రముల శోభతో గ్రంథం ప్రచురితమైనది. గ్రంథంలో ప్రథమంగా శ్రీమాన్ శ్రీ కౌమాండూరు ఇళైవిల్లి స్థలశాయి స్థానాచార్యులు (భద్రాచలం దేవస్థానం) వారు రచించిన ద్వయ మంత్ర సంక్షిప్త వ్యాఖ్యానము కలదు. సాంప్రదాయ గ్రంథకర్తలు శ్రీమాన్ కండ్లకుంట్ల వెంకట నరసింహాచార్యులు రచించిన విష్ణు పురాణ పరిచయ విశేషాలు, శ్రీమాన్ డా.కిడాంబి నర్సింహాచార్యులు రచించిన ఆళవందారు స్తోత్ర అర్థ విశేషాలు వివరించబడ్డాయి. మరియు చక్కని విషయసూచికా వివరణలతో విష్ణు పురాణ మూలము ప్రథమాంశం నుండి షష్ఠ్యాంశము, ఉపసంహారము వరకు పారాయణ సౌలభ్యంగా ఫలములను తెలుపుతూ ముద్రించబడింది. అమూల్యమైన ఈ గ్రంథ రాజంలో అనేక సాంప్రదాయ విశేషాలతో పాటు చివరి పేజీలలో (ప్రపన్న ధర్మసార సముచ్ఛయం లోని) అష్టాక్షరీ, ద్వాదశాక్షరీ, షడక్షరీ మంత్ర జప విధానము కూడా తెలుపబడినది. గ్రంథము వెల: 440 రూపాయలు. లభించు ఫోన్ నెంబర్:9490267511 /8331817994







# శ్రీకృష్ణావతార ప్రాశస్త్యమ్

(8 వ పేజీ తరువాయి) మూడవ జన్మమున వారే దేవకీ వసుదేవులుగా జన్మించగా భగవానుడు వారికి కృష్ణుడై అవతరించాడు.

ఏతద్వాం దర్శితం రూపం ప్రాగ్జన్మ స్మరణాయ మే।
నాన్యథా మద్భవం జ్ఞానం మర్త్య లిఙ్గేన జాయతే॥

"ఓ దేవకీ వసుదేవులారా! పూర్వజన్మ స్ఫురించటానికై మీకు ఈ చతుర్భుజ రూపమును చూపాను. లేనిచో మనుష్యోచితములైన లక్షణములతో విష్ణువని అవతార జ్ఞానం మీకు కలుగదు కదా!

యువాం మాం పుత్రభావేన బ్రహ్మాభావేనా చాసకృత్।
చిన్తయన్తే కృత స్నేహే యాస్యేథే మద్గతిం పరామ్।

"మీరు నిరంతరము పుత్రభావనతోనూ, భగవద్భావం తోనూ చింతిస్తూ అనురాగయుక్తులై పరమగతిని పొందగలరు". అని సాక్షాత్తు భగవానునే పుత్రునిగా కోరుకున్న సాధు శిఖామణులగు దేవకీ వసుదేవులకు పుత్రుడుగా అద్భుతమైన చతుర్భుజ రూపంతో దర్శనమిచ్చి ప్రాకృత శిశువువలె మారి ఆనందింపజేయుట సాధు పరిత్రాణమే కదా! దీనినే అన్నమాచార్యులవారు

పుట్టేయపుడే చతుర్భుజాలు శంఖ చక్రాలు
ఎట్టు ధరియించెనే శ్రీకృష్ణుడూ
అట్టే కిరీటము ఆభరణములు ధరించి
ఎట్ట ఎదుట నున్నాడు శ్రీకృష్ణుడు
సతులారా చూడరే శ్రావణ బహుళాష్టమి
కతలాయే నడిరేయి కలిగె శ్రీకృష్ణుడు

అంటూ శ్రావణ బహుళాష్టమి నాటి శ్రీకృష్ణ ఆవిర్భావాన్ని అభివర్ణించారు. "కృష్ణాదన్యః కోవా ప్రభవతి గో గోపికా ముక్త్యై" అని. ఎన్ని అవతారాలున్నా ఎటువంటి మోక్ష సాధనములు చేయజాలని, గోవులు, గోపికలు, గోపాలురకు కూడా ముక్తిని ప్రసాదించిన కృష్ణుని మించిన దైవము లేదు కదా! అంటారు లీలాశుకుల వారు.

కృష్ణుడు కేవలం దైవం మాత్రమే కాదు. గురువు కూడా, గురువును మించిన దైవం లేదు. 'గురువు' అంటే అజ్ఞానపు చీకటిని తొలగించి, జ్ఞాన దీప్తులను వెలిగించేవాడు. శ్రీకృష్ణుడు భగవద్గీతను బోధించి జగద్గురువైనాడు కదా! గీతను మించిన వెలుగు మరొకటి కలదా? లేదు. ఈనెల ఏడవ తేదీన శ్రీకృష్ణ జయంతి. ఆ కృష్ణపరమాత్మను ఆనాడు ఆరాధించి తరించుదాం .... ★

# ఆధ్యాత్మిక వార్తలు



కరీంనగర్ వేదభవనంలో స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమ వేడుకలు




తెలంగాణ భవన్, ఢిల్లీ లో శిఖరం ఆర్ట్ థియేటర్స్ వారి 77 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో నంది అవార్డ్స్ ప్రదాన కార్యక్రమంలో హైదరాబాద్ సంతోష్ నగర్ శ్రీవెంకటేశ్వర దేవాలయ అర్చకులు శ్రీమాన్ నల్లతీగ శ్రీనివాసాచార్యులకు అర్చక పురస్కారం ప్రదానం చేయడం జరిగింది.







యాజ్ఞికపీఠమ్, శ్రీమాన్ శ్రీ డా॥ పి.టి.జి.యస్. కిశోరస్వామి ఆధ్వర్యంలో యాదాద్రి లో జరిగిన

## 108 కుండాల శ్రీ భూ వరాహ మహాయజ్ఞం విశేషాల చిత్రమాలిక





ఈ కార్యక్రమంలో తెలంగాణా, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడుకు చెందిన ఋత్విక్కులు, హోతలు, ఉపద్రష్టలు పాల్గొన్నారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని శ్రీ భూ వరాహ యజ్ఞ విశిష్టతను తెలియజేసి అందరికి మంగళాశాసనాలు అందజేశారు.